ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల జిల్లా వార్తలు
5★★★
ఆదివారం 2 నవంబరు 2025



ఉత్తమ ఫలితాలే లక్ష్యం

- 'పది' పరీక్షలకు ప్రత్యేక తరగతులు
- వంద శాతం ఉత్తీర్ణతకు పకడ్బందీగా ప్రణాళిక
- జనవరి నుంచి రెండు పూటల తరగతుల నిర్వహణ
- మార్చిలో పరీక్షలు..



(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

పదో తరగతి వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా రాజన్న సిరిసిల్ల జిల్లాలో విద్యాశాఖ కసరత్తు ప్రారంభించింది. పదో తరగతి చదివే విద్యార్థుల వార్షిక పరీక్షల్లో ఏ విధంగా సన్నద్ధం కావాలనేది టీజీఎస్ఈఆర్టీ ప్రత్యేక కార్యాచరణ ప్రకటించింది. దీని ప్రకారం జిల్లాలో ఉపాధ్యాయులు ప్రణాళికాబద్ధంగా ప్రత్యేక తరగతుల నిర్వహణ మొదలుపెట్టారు. బోధించిన పాఠ్యాంశాలలో ముఖ్యాంశాలను మరోసారి అర్థం చేయించడం, అవసరమైన సబ్జెక్టులు మరోసారి బోధిస్తారు. విద్యార్థులకు కలిగే సందేహాలు తీరుస్తున్నారు. పాఠశాలల్లో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెడుతున్నారు.

జిల్లాలో 7452 మంది విద్యార్థులు

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని 667 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో అన్ని తరగతుల విద్యార్థులు 79,747 మంది ఉన్నారు. ఇందులో బాలురు 39,147 మంది, బాలికలు 40,600 మంది ఉన్నారు. జిల్లాలో రెండు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, 109 జడ్పీ ఉన్నత పాఠశాలలు, 13 కేజీబీవీలు, 7 మోడల్ స్కూలు, మూడు ఎంపీహెచ్ఎస్, 21 రెసిడెన్షియల్, వెల్ఫేర్ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో పదో తరగతి విద్యార్థులు 7,452 మంది ఉన్నారు. ఇందులో బాలురు 3,622 మంది, బాలికలు 3,830 మంది ఉన్నారు. పదో తరగతి పరీక్షల్లో గతంలో కంటే మెరుగైన ఫలితాలు విద్యార్థులు సాధించే దిశగా విద్యార్థులకు అభ్యాసన దీపికలు కూడా అందిస్తున్నారు. ప్రస్తుతం డిసెంబరు వరకు సాయంత్రం 4.15 గంటల నుంచి 5.15 గంటల వరకు తరగతులు నిర్వహిస్తున్నారు. జనవరి నుంచి ఉదయం, సాయంత్రం వేళల్లో రెండు పూటలు తరగతులు నిర్వహించే విధంగా చర్యలు చేపట్టనున్నారు. పదో తరగతి విద్యార్థుల ప్రత్యేక తరగతులు పకడ్బందీగా కొనసాగేలా ఇప్పటికే ప్రధానోపాధ్యాయులతో సమావేశాలు నిర్వహించారు. ప్రత్యేక తరగతులతో పాటు టెస్టులు కూడా నిర్వహిస్తారు.

ఉపాధ్యాయులకు మార్గదర్శకాలు

పది ఫలితాల్లో జిల్లాను ముందు వరుసలో నిలిపే విధంగా ప్రతి సంవత్సరం వార్షిక పరీక్ష సమయంలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం మార్చిలో జరిగే వార్షిక పరీక్షల్లో కూడా విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించే దిశగా ఉపాధ్యాయులకు విద్యాశాఖ మార్గదర్శకాలను జారీ చేసింది. ఉపాధ్యాయులు సిలబస్ జనవరి 10లోపు పూర్తిచేయాలని ఆ తర్వాత రివిజన్ తరగతులు ప్రారంభించాలని సూచించింది. ఎస్ఏ-1 పరీక్షల ఫలితాల ఆధారంగా విద్యార్థులను ఏ,బీ,సీ గ్రూపులుగా విభజించి సీ గ్రూప్ విద్యార్థులకు పునశ్చరణ తరగతులు స్లిప్‌టెస్టులు నిర్వహించాలి. ప్రతి ఉపాధ్యాయుడు కొంతమంది విద్యార్థులను దత్తత తీసుకొని వారిని వ్యక్తిగతంగా మార్గదర్శనం చేయాలి. విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా పర్యవేక్షణ చేయాలని విద్యాశాఖ పేర్కొంది.

జిల్లాలో 'పది' ఫలితాలు ఇలా..

రాజన్న సిరిసిల్ల జిల్లాలో పదో తరగతి పరీక్షల ఫలితాలు కొంత ఆశాజనకంగానే ఉన్నప్పటికీ ముందు వరుసలో నిలవలేకపోతోంది. మరోవైపు కొన్ని పాఠశాలల్లో విద్యా బోధనపై అంతంత మాత్రంగానే బోధనపై ప్రధానోపాధ్యాయుల పర్యవేక్షణ కొరవడుతుందనే విమర్శలు ఉన్నాయి. 2024-25 పది ఫలితాల్లో రాజన్న సిరిసిల్ల జిల్లా రాష్ట్రస్థాయిలో తన స్థానాన్ని తగ్గించుకుంది. 2023-24 విద్యా సంవత్సరంలో రాష్ట్రంలో మూడో స్థానంలో నిలిచిన జిల్లా ఈసారి 98.15 శాతం ఉత్తీర్ణతతో ఐదో స్థానంతో సరిపెట్టుకుంది. 2024-25 జిల్లాలో

మిగతా 8వ పేజీలో

రేపు పత్తి కొనుగోలు కేంద్రాలు ప్రారంభం..

- జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రకాష్

సిరిసిల్ల రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని వేములవాడ మార్కెట్ కమిటీ పరిధిలోని మూడు పత్తి కొనుగోలు కేంద్రాలను ఈనెల 3వ తేదీన ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రారంభిస్తారని జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రకాష్ తెలిపారు. వేములవాడ మార్కెట్ కమిటీ పరిధిలోని లక్ష్మీనర్సింహ కాటన్ ఇండస్ట్రీస్ నాంపెల్లి, లక్ష్మీ ఇండస్ట్రీస్ సుంకెపల్లి, శ్రీకావేరి కాటన్ ఇండస్ట్రీస్ సుద్దాలలో సీసీఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడం జరుగుతుందని పత్తి రైతులు తమ పత్తిని తీసుకువచ్చి విక్రయించుకోవాలని కోరారు. పత్తి రైతులు తప్పనిసరిగా కపాస్ కిసాన్ యాప్ ద్వారా స్లాట్ బుకింగ్ చేసుకుని మాత్రమే వారి పత్తిని సీసీఐ వారికి అమ్మడానికి తీసుకు రావాలని అలాగే కపాస్ కిసాన్ యాప్ ద్వారా స్లాట్ బుకింగ్ చేసుకోకపోతే అట్టి పత్తిని సీసీఐ వారు కొనుగోలు చేస్తారన్నారు. కపాస్ కిసాన్ యాప్ ద్వారా స్లాట్ బుకింగ్ సమయంలో పత్తి రైతులు ఏమైనా ఇబ్బందులు ఎదుర్కొంటున్న లేదా స్లాట్ ఎలా బుక్ చేసుకోవాలో తెలియకపోయిన మీ దగ్గరిలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. సీసీఐ పత్తిని అమ్మడానికి తీసుకువచ్చి రైతులు కనీస మద్దతు ధర రూ.8110 పొందడానికి పత్తిలో 8 శాతం తేమ మించకుండా చూసుకోవాలన్నారు. తేమ 12 శాతం కంటే మించి ఉన్న పత్తిని సీసీఐ ఎట్టి పరిస్థితులల్లో కొనుగోలు చేయరని పత్తి రైతులు గమనించాలన్నారు. రైతులు పత్తిని ఇంటి వద్దనే ఆరబెట్టుకుని ఎండిన తర్వాతనే తీసుకుని రావాలని కోరారు. రైతులు సీసీఐ కొనుగోలు కేంద్రాలకు వచ్చేటప్పుడు తప్పకుండా తమ ఆధార్‌కార్డు, పట్టాదార్ పాసుబుక్‌లు, ఆధార్‌కార్డుకు అనుసంధానంగా ఫోన్‌లతో రావాలని మార్కెటింగ్ అధికారి ప్రకాష్ కోరారు.

వేధింపులపై పోలీసులకు ఫిర్యాదు చేయాలి

- ఎస్పీ మహేష్ బీ గితే..

సిరిసిల్ల రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మహిళలు, విద్యార్థినులు వేధింపులకు గురైనప్పుడు భయపడకుండా ధైర్యంగా ముందుకువచ్చి పోలీసులను సంప్రదిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ మహేష్ బీ గితే ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో షీటీమ్ బృందం విద్యాసంస్థల్లో, మహిళలు పని చేసే ప్రదేశాల్లో ర్యాగింగ్ ఈవ్‌టీజింగ్, పోక్సో షీటీమ్స్, మహిళా చట్టాలపై అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. గడిచిన పది నెలల్లో షీటీంకు వచ్చిన ఫిర్యాదులపై కేసులు నమోదు చేసి మహిళలు, విద్యార్థినులను వేధిస్తున్న వారిని గుర్తించి వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇచ్చామని తెలిపారు. మహిళలు, విద్యార్థినులు అభద్రతా భావానికి గురైనప్పుడు భయపడొద్దని, ధైర్యంగా ముందుకు వచ్చి షీటీంలకు ఫిర్యాదులు చేస్తే నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. జిల్లాలో మహిళలు, విద్యార్థినుల రక్షణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, ప్రధానంగా అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. వ్యక్తిగత సమాచారాన్ని వారితో పంచుకోవద్దని, ముఖ్యంగా సామాజిక మధ్యమాల్లో పరిచమయ్యే వ్యక్తులతో మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మహిళలు పనిచేసే ప్రదేశాల్లో లైంగిక వేధింపులకు గురైతే ధైర్యంగా ఫిర్యాదులు చేయాలన్నారు. ఎవరైనా అకతాయలు మహిళలు, యువతులు, విద్యార్థినీలను వేధింపులకు గురిచేస్తే జిల్లా షీం టీ నంబర్ 8712656425కు ఫిర్యాదు చేయాలని ఎస్పీ కోరారు.

వర్షాలకు నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

- అదనపు కలెక్టర్‌కు బీజేపీ నాయకుల వినతి



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందిస్తున్న బీజేపీ నాయకులు

సిరిసిల్ల కలెక్టరేట్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్‌తో నష్టపోయిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వడంతో పాటు తడిసిన ధాన్యం, పత్తి పంటను కొనుగోలు చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు పోన్నాల తిరుపతిరెడ్డి, సిరికొండ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. కలెక్టరేట్‌లో శనివారం అదనపు కలెక్టర్ గడ్డం నగేష్‌ను బీజేపీ నాయకులు కలిశారు. అకాల వర్షాలతో నష్టపోయిన పంటలతో పాటు తడిసిన పత్తి, ధాన్యంను కొనుగోలు చేయాలని, నష్టపరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలంటూ వినతిపత్రాన్ని అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా కురిసిన అకాల వర్షం కారణంగా ధాన్యం కుప్పలు పూర్తిగా తడిసిపోయాయన్నారు. వాతావరణం కూడా రైతులకు అనుకూలంగా లేదని, ధాన్యం కాపాడుకునేందుకు రైతులకు టార్పాలిన్ కవర్లను అందజేయాలన్నారు. తేమశాతం షరతు లేకుండా కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని, రైతులకు నష్టం కాకుండా చూడాలన్నారు. అలస్యం చేయకుండా ధాన్యాన్ని రైస్‌మిల్లులకు తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు సిర్రం తిరుపతి, మెడిశెట్టి బాలయ్య, గడ్డం రవి తదితరులుపాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రంలో డీఎంహెచ్‌వో తనిఖీ



సిరిసిల్లలో తనిఖీలు నిర్వహిస్తున్న డాక్టర్ రజిత

సిరిసిల్ల టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్‌నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రజిత తనిఖీ నిర్వహించారు. ఆరోగ్య కేంద్రంలోని వ్యాధి నిరోధక టీకాలు, రికార్డులను పరిశీలించారు. అనంతరం కేంద్ర ఆరోగ్య పథకాల లక్ష్యాలపై వైద్యాధికారి, సిబ్బందితో సమీక్షించారు. సకాలంలో లక్ష్యాలను సాధించాలని, వర్షాలు కురుస్తున్నందున గృహ సర్వేలు నిర్వహించాలని ఆదేశించారు. విష జ్వరాలు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, విధి నిర్వహణలో సమయపాలన పాటించాలన్నారు. వెంట ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ రేఖ, సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి, సిబ్బంది ఉన్నారు.

ఎస్ఎఫ్ఐ నాయకుల భిక్షాటన

వేములవాడ టౌన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శనివారం వేములవాడ పట్టణంలోని తెలంగాణ చౌరస్తాలో భిక్షాటన చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్ మాట్లాడారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి తక్షణమే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి కడారీ శివ, నాయకులు సాయికుమార్, నందిని, నాగరాణి తదితరులు పాల్గొన్నారు.

15న సిరిసిల్ల, వేములవాడ కోర్టుల్లో ప్రత్యేక లోక్‌అదాలత్

- జిల్లా న్యాయ సేవాధికారిసంస్థ కార్యదర్శి రాధిక జైస్వాల్



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి రాధిక జైస్వాల్

సిరిసిల్ల రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని కోర్టుల్లో ఈనెల 15వ తేదీన ప్రత్యేక లోక్ అదాలత్‌లను నిర్వహించనున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రాధిక జైస్వాల్ కోరారు. సిరిసిల్ల కోర్టులో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో రాధిక జైస్వాల్ మాట్లాడుతూ రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు సిరిసిల్ల, వేములవాడ కోర్టుల్లో ప్రత్యేక లోక్‌అదాలత్‌లను నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఎన్ యాక్ట్ కేసులు, కాంపౌండబుల్ క్రిమినల్ కేసులు, కుటుంబ తగాదాలు, మోటార్ వాహనాల కేసులు, పెండింగ్‌లో ఉన్న సివిల్ కేసులు, బ్యాంక్ కేసుల పరిష్కారం కోసం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో డీఎల్ఎస్ఏ సృజన, న్యాయమూర్తి మేఘన, సిరిసిల్ల బార్ అసోసియేన్ అధ్యక్షుడు జూపెల్లి శ్రీనివాసరావు, లోక్‌అదాలత్ సభ్యులు చింతోజు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధలకు విరుద్ధంగా స్వామివారి మహానివేదన

వేములవాడ టౌన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఆగమశాస్త్ర నిబంధనలకు విరుద్ధంగా రాజరాజేశ్వర స్వామివారి మహానివేదన తయారుచేస్తున్నారని బీజేపీ సీనియర్ నాయకుడు ప్రతాప రామకృష్ణ ఆరోపించారు. శనివారం ఆలయ వంట గదిని సందర్శించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో స్వామివారికి జరిగే పూజల్లో మహానివేదనపై అపచారం జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదన్నారు. ఇటీవల విజయయాత్రలో భాగంగా వేములవాడకు వచ్చిన శృంగేరి పీఠాధిపతులు విదుశేఖర భారతి మహాస్వామి చేసిన సూచనలను తుంగలో తొక్కారన్నారు. కట్టెల పొయ్యిమీద వండాల్సిన మహానివేదనను సిలిండర్లపై చేస్తున్నారన్నారు. కార్తీకమాసం తొలి సోమవారం రోజున స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకానికి కనీసం నీళ్లు లేవన్నారు. దేవాలయంలో జరిగే పూజలను ఏకాంతంగా నిర్వహిస్తామని చెప్పిన అధికారులు సరిగా నిర్వహించడంలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు ఆలయంలో జరుగుతున్న పూజలను సక్రమంగా నిర్వహించాలన్నారు. ఈ సంఘటనలపై విచారణ జరిపి బాధ్యుతలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మహిళలు పాడితో ఉపాధి పొందాలి

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), నవంబరు1(ఆంధ్రజ్యోతి): మహిళలు పాడి పరిశ్రమపై దృష్టి సారించి ప్రత్యామ్నాయ ఉపాధి పొందాలని కరీంనగర్ డెయిరీ జనరల్ మేనేజర్ రామరాజు అన్నారు. వీర్నపల్లి మండలం బంజేరు గ్రామంలోని పాల ఉత్పత్తిదారులైన మహిళా రైతులకు డెయిరీ ఆధ్వర్యంలో పాల క్యాన్లు, బ్యాగులను శనివారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రామరాజు మాట్లాడుతూ మహిళలు వ్యవసాయానికి అనుబంధంగా పాడి గెదేల పెంపకం వల్ల ఆర్థికంగా ఎదుగుతారని అన్నారు. పశు సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. సంస్థ అన్ని విధాలుగా ప్రోత్సహిస్తోందని రామరాజు అన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ రాజిరెడ్డి, సూపర్‌వైజర్ నాగరాజు, పాల ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు లక్ష్మీ, తాజా, మాజీ సర్పంచ్ కళ, నాయకులు లింబాద్రి, రవినాయక్, దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

ఇల్లంతకుంట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వల్లంపట్ల గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక అయ్యారు. పాఠశాలలో ఎనిమిదవ తరగతి చదువుతున్న మందరిశ్వంత్, మల్లమారి అభినయ్‌లు గోదావరిఖనిలో జరిగిన అండర్ 14 విభాగంలో ఉత్తమ ప్రదర్శన కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. విద్యార్థులు ఎంపిక కావడంపై ప్రధానోపాధ్యాయుడు దూస గోవర్ధన్, పీడీ సాబీర్‌లతో పాటు పలువురు గ్రామస్థులు అభినందనలు తెలిపారు.

తుఫాన్ నష్టంపై నివేదికలు అందించాలి

- ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగర్వాల్ - అధికారులతో సమీక్ష సమావేశం



అధికారులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగర్వాల్

సిరిసిల్ల కలెక్టరేట్, నవంబర్ 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో తుఫాన్ నష్టంపై సమగ్ర నివేదికలను అధికారులు వెంటనే అందించాలని ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగర్వాల్ అదేశించారు. కలెక్టరేట్‌లో శనివారం తుఫాన్ నష్టంపై సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశాన్ని ఆమె నిర్వహించారు. ఇటీవల తుఫాన్ కారణంగా పాక్షికంగా పూర్తిగా నష్టపోయిన ఇళ్ల వివరాలను రెవెన్యూ అధికారులు, పంట నష్టంపై వ్యవసాయ శాఖ అధికారులు, రోడ్లు, వంతెనలు, కల్వర్టుల నష్టంపై ఆర్‌అండ్‌బీ అధికారులు, స్కూల్స్, అంగన్‌వాడీ కేంద్రాలు, రెసిడెన్షియల్ హాస్టళ్లు, ప్రభుత్వ శాఖల భవనాల్లో లీకేజీలపై డీఈవో, డీడబ్ల్యూవో, ప్రాజెక్టులు, చెరువులు, కుంటల లీకేజీ, మరమ్మతుపై నీటి పారుదల శాఖ అధికారులు, విద్యుత్ స్థంభాలు, సబ్‌స్టేషన్లలో నష్టం అంచనాలను సెస్ అధికారులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం పూర్తి నివేదికలను మంగళవారంలోగా అందజేయాలని ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, సిరిసిల్ల ఆర్డీవో వెంకటేశ్వర్లు, వేములవాడ అర్డీవో రాధాబాయి, అర్‌అండ్ బీ ఈఈ నర్సింహాచారీ, డీఏవో అఫ్జల్ బేగం, నీటి పారుదల శాఖ జిల్లా అధికారి కిషోర్ కుమార్, సెస్ ఎండీ బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

రైతులు రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

- ప్యాక్స్‌చైర్మన్ రొండ్ల తిరుపతిరెడ్డి



రైతులకు చెక్కులను పంపిణీ చేస్తున్న ప్యాక్స్‌చైర్మన్ తిరుపతిరెడ్డి

ఇల్లంతకుంట, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): రైతులు రుణాలను సద్వినియోగం చేసుకోవాలని ప్యాక్స్‌చైర్మన్ రొండ్ల తిరుపతిరెడ్డి పేర్కొన్నారు. మండలకేంద్రంలోని సహకార సంఘ కార్యాలయంలో శనివారం రైతులకు రుణాల చెక్కులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘ పరిధిలోని ఆరుగురు రైతులకు రూ 36.50లక్షల దీర్ఘకాలిక రుణాలు మంజూరయ్యాయని తెలిపారు. తీసుకున్న రుణాలను పెట్టుబడిగా పెట్టి బలోపేతం కావాలని సూచించారు. రుణాలు తీసుకున్న రైతులు సకాలంలో చెల్లించినప్పుడే సంఘం అభివృద్ధి చెందడంతో పాటు కొత్తవారికి రుణాలు అందుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు సృజన్‌రెడ్డి, కొమురయ్య, సీఈఓ చిట్టి రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

- పీఆర్టీయూటీఎస్ జిల్లా అధ్యక్షుడు గన్నమనేని శ్రీనివాస్‌రావు



మాట్లాడుతున్న పీఆర్టీయూటీఎస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు

సిరిసిల్ల టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఆశనిపాతంగా ఉన్న కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని పీఆర్టీయూటీఎస్ జిల్లా అధ్యక్షుడు గన్నమనేని శ్రీనివాస్‌రావు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని నెహ్రూనగర్ జిల్లా పరిషత్ హై స్కూల్‌లో పీఆర్టీయూటీఎస్ జిల్లా సర్వసభ్య సమావేశం జిల్లా అధ్యక్షుడు గన్నమనేని శ్రీనివాస్‌రావు అధ్యక్షతన జరిగింది. ముందుగా సర్వసభ్య సమావేశంలో జిల్లా కార్యదర్శి ఎడ్ల కిషన్ నివేదికను సమర్పించారు. అనంతరం 13 మండలాల అధ్యక్ష, కార్యదర్శులతో వివిధ అంశాలపై చర్చించి వారి అభిప్రాయాలను తెలుసుకొని కొన్ని తీర్మానాలను సర్వసభ్య సమావేశంలో ఆమోదించారు. ఈ సందర్భంగా గన్నమనేని శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల పెండింగ్‌లో ఉన్నటువంటి ఐదు డీఏ(కరువు భత్యం)లు ప్రభుత్వం మంజూరు చేయాలన్నారు. నూతన పే రివిజన్ కమీషన్ రిపోర్టును ప్రభుత్వం తెప్పించుకొని 45 శాతం ఫిట్మెంట్‌తో అమలు చేయాలన్నారు. ఎంప్లాయిస్ హెల్త్ స్కీం ఉద్యోగ, ఉపాధ్యాయుల కాంట్రీబ్యూషన్‌తో అన్ని అసుపత్రులో నగదు రహిత సేవలు పొందే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కేజీబీవీ ఉపాధ్యాయులకు మినిమం, టైం స్కేల్ అమలు చేయాలని ఇతర ఉద్యోగుల మాదిరిగా అన్ని రకాల సెలవులు వర్తింపచేయాలని, ఎంప్లాయిస్ హెల్త్‌కి హెల్త్ స్కీమ్‌ను వర్తింపజేయాలన్నారు. మోడల్ స్కూల్లలో పని చేస్తున్న ఉపాధ్యాయులకు జీరో వన్ జీరో హెడ్స్ ఆఫ్ అకౌంట్ కింద పాలసీ ఇవ్వాలన్నారు. పదోన్నతులకు కూడా అవకాశాలు కల్పించాలన్నారు. ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేయబోతున్న ఇంటిగ్రేటెడ్ స్కూల్‌లలో ప్రస్తుతం పని చేస్తున్న పంచాయితీరాజ్ ఉపాధ్యాయులను కూడా తీసుకోవాలన్నారు. సర్వీస్‌లో ఉన్న సీనియర్ ఉపాధ్యాయులకు నష్టం జరగకుండా టీఈటీకి సంబంధించిన కేంద్ర ప్రభుత్వం చట్టం సవరణ చేయుటకు రాష్ట్ర ప్రభుత్వం సిఫారసు చేయాలని కోరారు. ప్రాథమిక విద్యా వ్యవస్థ బలోపేతానికి అన్ని పాఠశాలలో ప్రీ ప్రైమరీ తరగతులు ఏర్పాటు చేస్తూ ఒక ప్రధానోపాధ్యాయుని పోస్టు అలాగే 60 మంది విద్యార్థులు ఉన్న ప్రాథమిక పాఠశాలకు తరగతికి ఒక ఉపాధ్యాయుడి చొప్పున పోస్టులను మంజూరు చేయాలన్నారు.

ఈ సమావేశంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు నీలి శ్రీనివాస్, జిల్లా నాయకులు మాడిశెట్టి మహేష్, జక్కని నవీన్, కైరి పద్మ, షేక్‌బాబు, గుర్రం దేవదాస్, ఎర్ర ప్రవీన్, నల్ల పర్శరాం, తెల్ల పూర్ణచందర్, అరకాల బాల్‌రెడ్డి, ఆయా మండలాల అధ్యక్ష, కార్యదర్శులు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జీఎం కాలనీ ఆలయంలో చోరీ

కోల్‌సిటీ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని జీఎం కాలనీలోని హనుమాన్ దేవాలయంలో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. గుర్తుతెలియని వ్యక్తులు హుండీ పగులగొట్టి అందులోని నగదు, కానుకలను ఎత్తుకెళ్లారు. ఆలయకమిటీ నిర్వాహకులు శనివారం ఉదయం విషయాన్ని గమనించి వన్‌టౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. వన్‌టౌన్ పోలీసులు, క్లూస్ టీమ్ ఘటన స్థలంలో పరిశీలించారు. కాగా ఆలయంలో సీసీ కెమెరాలు పని చేయకపోవడంతో చోరీకి సంబంధించిన ఆధారాలు లభించలేదు. గతంలో ఇదే ఆలయంలో హుండీ చోరీ జరిగింది. రెండోసారి చోరీ జరుగడంతో పోలీసులు జాగ్రత్తలు తీసుకోవాలని ఆలయ కమిటీకి సూచించారు.

రేణుక ఎల్లమ్మ ఆలయంలో..

ఎండపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎండపల్లి మండలం ముంజంపల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి రేణుకఎల్లమ్మ తల్లి దేవాలయంలో గుర్తుతెలియని వ్యక్తులు హుండీ పగుల గొట్టి దొంగతనం చేశారు. హుండీలోని రూ.50వేల విలువైన పుస్తె, మట్టెలను ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. సంఘటనా స్థలాన్ని బసంత్‌నగర్ ఎస్‌ఐ శ్రీధర్, ఎండోమెంట్ అధికారులు శరత్, శ్రీనివాస్ పరిశీలించి దర్యాప్తు ప్రారంభించారు.

గంజాయి పట్టివేత

కోల్‌సిటీ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని సంజయ్‌గాంధీనగర్ వాటర్ ట్యాంకుసమీపంలో శనివారం తప్పట్ల సందీప్ అలియాస్ బబ్లూ అనేవ్యక్తి నుంచి 135 గ్రాముల గంజాయిని పట్టుకున్నట్టు సీఐ ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు. ఎస్‌ఐ రమేష్ సిబ్బందితో పెట్రోలింగ్ చేస్తుండగా వాటర్ ట్యాంకుగేట్ ఎదురుగా సందీప్ అనుమానాస్పదంగా తచ్చాడుతూ కనిపించాడు. అతడిని విచారణ చేయగా గంజాయి దొరికినట్టు సీఐ ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు.

- గత ప్రభుత్వ హయాంలో కొంత పరిహారం, పట్టాలు పంపిణీ
- కాంగ్రెస్ ప్రభుత్వంపైనే నిర్వాసితుల ఆశలు



పరిహారం కోసం నిరీక్షణ

వేములవాడ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మధ్యమానేరు నిర్వాసితులు పరిహారం కోసం పదిహేనేళ్లుగా నిరీక్షిస్తున్నారు. మధ్యమానేరు జలాశయంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో 11గ్రామాలు ముంపు గ్రామాలుగా ప్రకటించారు. బోయినపల్లి, వేములవాడ మండలాల్లోని ఆరెపల్లి, సంకెపల్లి, రుద్రవరం, అనుపురం, కొడుముంజ, శాభాష్‌పల్లి, చింతలఠాణా, చీర్లవంచ, గుర్రంవానిపల్లి, కొదురుపాక, నీలోజిపల్లి, వర్దవెల్లి గ్రామాలు ముంపునకు గురయ్యాయి. 2008లో ఆయా గ్రామాల్లో 10683 కుటుంబాలు ముంపునకు గురవుతున్నట్లు గుర్తించి గెజిట్ ప్రకటించారు. ఒక్కో కుటుంబానికి రెండు గుంటల స్థలంతో పాటుగా వృత్తి ఆధారంగా పరిహారం చెల్లించేందుకు నిర్ణయించారు. నిర్వాసితులకు 2010 నుంచి పరిహారం చెల్లించడం ప్రారంభించారు. 10683 కుటుంబాలకు 10044 కుటుంబాలకు పరిహారం చెల్లిం చారు. మిగతా 639 కుటుంబాల్లో 219 కుటుంబాలకు చెందిన వారి సంతకాలను అధికారులు సేకరించి బడ్జెట్ కోసం రూ.20.22 కోట్లతో నివేదికను ప్రభు త్వానికి అందించారు. మిగిలిన 420 కుటుంబాల్లో కొం దరు కోర్టును ఆశ్రయించగా, మరికొందరు వృత్తి మార్పులు తప్పులుగా పడటంతో పాటు వివిధ కారణాలతో పరిహారం తీసుకోలేదు. వీరి కోసం మరో రూ.30.61 కోట్లు చెల్లించాల్సిన అవసరం ఉందని తెలుస్తోంది. గత ప్రభుత్వం విడతల వారీగా నిర్వాసి తులకు పరిహారం చెల్లిస్తూ 10 సంవత్సరాలు గడిచినా పూర్తిస్థాయిలో నిర్వాసితులకు పరిహారం అందించ డంలో నిర్లక్షంగా వ్యవహరించిందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై గంపెడు ఆశతో ఉన్నామని నిర్వాసితులు చెబుతున్నారు.

ఇంకా అందాల్సిన పరిహారం..

మధ్యమానేరు జలాశయంలో ముంపునకు గురవుతున్న నిర్వాసిత యువతీయువకులకు ఒక కటాఫ్ డేట్‌తో ప్రతి ఒక్కరికి రూ.2 లక్షల పరిహారం అందించాలని అప్పటి ప్రభుత్వం నిర్ణయించింది. అయితే ముంపు గ్రామాల్లో మొత్తం 3917మంది యువతను గుర్తించారు. అందులో యువతులు మొత్తం 2303 మందిని గుర్తించి, 1879 మందికి రూ.2లక్షల చొప్పున పరిహారం చెల్లించారు. ఇంకా 335 మంది యువతుల వద్ద సంతకాలు సేకరించి బడ్జెట్ కోసం ప్రభుత్వానికి నివేదిక పంపించారు. మిగతా 89మంది యువతుల సంతకాలు మాత్రమే సేకరించారు, వారికి ఇంకా పరిహారం చెల్లించాల్సి ఉంది. 1614 మంది యువకులను గుర్తించగా, 1537 మందికి పరిహారం చెల్లించగా, 28 మంది యువకుల సంతకాలు సేకరించి బడ్జెట్ కోసం నివేదికను ప్రభుత్వానికి పంపించారు. మిగిలిన 49 మంది యువకులు వివిధ కారణాలతో పరిహారం తీసుకోవడం లేదు. వారికి ఇంకా చెల్లించాల్సి ఉంది.

ప్రభుత్వం చొరవ తీసుకోవాలి..

\- గుండెకార్ల దేవయ్య, ఆరెపల్లి



వేములవాడ మండలం ఆరెపల్లి గ్రామం మాది. మా ఇల్లు ముంపులో పోయింది. అధికారులు వచ్చి దరఖాస్తులు తీసుకువెళ్లారు. నాలుగు సంవత్సరాల క్రితం నోటిఫికేషన్ పూర్తి అయింది. ఇప్పటి వరకు నాకు ఇంటి పరిహారం అందలేదు. ప్రభుత్వానికి నివేదిక పంపించామని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం చొరవ తీసుకోవాలి.

నిర్వాసితులపై దృష్టి సారించాలి..

\- జింక శ్రీధర్, సంకెపల్లి



సంకెపల్లి గ్రామంలో గతంలో కొన్ని ఇళ్లను మాత్రమే ముంపునకు తీసుకున్నారు. తరువాత మిడ్‌మానేరు జలాశయం కెపాసిటీ పెంచిన తరువాత వాటర్ ఎఫ్‌టీఎల్‌ను దాటి రావడంతో పూర్తి ముంపు గ్రామంగా ప్రకటించారు. గత ప్రభుత్వ హయాంలో పరిహారం, పట్టాలు వచ్చాయి. గ్రామంలో ఇంకా మిగిలిన 44 ఇళ్లకు పరిహారం రావాల్సి ఉంది. నోటిఫికేషన్ పూర్తి అయినప్పటికి పరిహారంలో ఆలస్యం అవుతోంది. ప్రభుత్వం త్వరగా పరిహారం అందించాలి.

డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో 14మందికి జైలుశిక్ష

- 57 మందికి జరిమానాలు



మందు బాబులకు కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

వేములవాడ టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనాలు నడిపిన 14మందికి జైలు శిక్షపడగా, 57మందికి జరిమానా విధించారు. ప్రాసిక్యూషన్ వివరాల ప్రకారం.. వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో 14రోజులుగా డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా 71 మంది పట్టుబడ్డారు. వీరందరినీ వేములవాడ పోలీసులు శనివారం కోర్టులో ప్రవేశపెట్టగా 14 మందికి జైలుశిక్ష, 57 మందికి జరిమానాలు విధిస్తూ వేములవాడ మేజిస్ట్రేట్ జ్యోతిర్మయి తీర్పు వెల్లడించారు. ఇందులో 10 మందికి రెండు రోజుల జైలుశిక్ష, ఒక్కొక్కరికి రెండు వేల రూపాయలు జరిమానా విధించారు. ఇద్దరికి మూడు రోజుల జైలు శిక్ష, రూ.2500 జరిమానా విధించారు. ఇద్దరికి మూడు రోజుల జైలు శిక్ష, రూ.2వేల జరిమానా విధించారు. 49మందికి ఒక్కొక్కరికి రూ.1300 చొప్పున జరిమానా విధించారు. 8మందికి ఒక్కొక్కరికి రూ.2500 జరిమానా విధించారు. ఈ సందర్భంగా వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్‌లో డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు.

మద్యం మత్తులో పురుగుల మందు తాగిన యువకుడు

- చికిత్స పొందుతూ మృతి

కరీంనగర్‌క్రైం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ కశ్మీర్‌గడ్డ ప్రాంతానికి చెందిన మాదిరి సతీష్‌కుమార్(39) అనే యువకుడు మద్యం మత్తులో పురుగుల మందుతాగగా చికిత్సపొందుతూ శనివారం మృతిచెందాడు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. సతీష్‌కుమార్ కొంత కాలంగా మద్యంకు బానిసగామారాడు. ఈక్రమంలో అక్టోబరు 18న మద్యం మత్తులో పురుగుల మందు తాగాడు. గమనించిన భార్య, ఇతర కుటుంబసభ్యులు కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతిచెందాడు. మృతుడు సతీష్‌కుమార్ భార్య అక్షయ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

వృద్ధురాలి ఆత్మహత్యాయత్నం

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఇంటి స్థల వివాదంలో తనకు అన్యాయం చేస్తున్నారని మనస్థాపం చెందిన వృద్ధురాలు ఈసరియాదవ్వ పురుగుల మందు తాగింది. ఈ సంఘటన వీర్నపల్లి మండలం కంచర్ల గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం మేరకు.. గ్రామంలోని వృద్ధురాలు యాదవ్వ, క్యారం మంజుల మధ్య కొంతకాలంగా స్థలవివాదం కొనసాగుతోంది. మంజుల న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. కోర్టు ఆదేశాలు పొందిన ఆమె స్థలంలో ఇంటి ప్రహరీ గోడ నిర్మాణ పనులను ప్రారంభించింది. ఎలాంటి గొడవలు చోటు చేసుకోకుండా ఎస్‌ఐ లక్ష్మణ్ ఆధ్వర్యంలోని పోలీసులు బందోబస్తు చర్యలు చేపట్టారు. తన స్థలంలో నిర్మాణం చేపడుతున్నారని యాదవ్వ అడ్డుతగిలింది. ఇరువర్గాల నడుమ వాగ్వావాదం చోటుచేసుకుంది. తనకు అన్యాయం చేస్తున్నారని వృద్ధురాలు యాదవ్వ పురుగుల మందుతాగింది. పోలీసులు పురుగుల మందు డబ్బాను లాక్కొని అపస్మారక స్థితిలోకి ఉన్న యాదవ్వను మొదట ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి సిరిసిల్లకు తీసుకెళ్లారు. ఈ విషయంపై ఎస్‌ఐ లక్ష్మణ్‌ను సంప్రదించగా ఇంటి స్థల విషయంలో మంజుల కోర్టు ఉత్తర్వుల ప్రకారం పనులను చేపట్టారని పేర్కొన్నారు. గొడవలు చోటు చేసుకోకుండా బందోబస్తు చర్యలు తీసుకున్నామనిచెప్పారు. వృద్ధురాలు యాదవ్వ ఆత్మహత్యకు యత్నించగా, అక్కడే ఉన్న తమ సిబ్బంది అడ్డుకుని పోలీసువాహనంలో ఆసుపత్రికి తరలించామని ఎస్‌ఐ లక్ష్మణ్ తెలిపారు.

సిరిసిల్లలో ముగ్గురి అరెస్ట్

- తల్వార్‌లతో శాంతిభద్రతలకు విఘాతం



దాడులు చేసుకున్న వారిని అరెస్ట్ చేసిన పోలీసులు

సిరిసిల్ల రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల జిల్లా కేంద్రంలో తల్వార్‌లతో శాంతి భద్రతలకు విఘాతం కలిగించిన ముగ్గురు వ్యక్తులను అరెస్ట్‌చేసినట్లు సిరిసిల్ల టౌన్‌సీఐ కృష్ణ తెలిపారు. పట్టణంలోని సుందరయ్య నగర్ సిక్‌వాడీకి చెందిన బురాని గోపాల్‌సింగ్, బురాని నర్సింహాసింగ్, రాజేష్‌సింగ్‌లు తల్వార్లు పట్టుకుని అక్టోబరు 8వ తేదీన రోడ్డుమీదికి వచ్చి భయం కరంగా అరుస్తూ వారిలోవారు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారని తెలిపారు. చుట్టపక్కల ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ ప్రజాశాంతికి భంగం కలిగించారని, ముగ్గురు వ్యక్తులను శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

స్కూటీ డిక్కీలోంచి నగదు చోరీ

కోల్‌సిటీ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని మార్కండేయకాలనీలోని వైష్ణవి బేకరీ ఎదుట పార్కింగ్‌చేసిన స్కూటీనుంచి శనివారం గుర్తుతెలియని వ్యక్తులు రూ.50వేలను ఎత్తుకెళ్లారు. ప్రభుత్వజనరల్ ఆసుపత్రిలో నర్సింగ్‌ఆఫీసర్‌గా పనిచేస్తున్న అంజలి మున్సిపల్‌ఆఫీస్ ఎస్‌బీఐఏటీఎంలో నగదు తీసుకుని స్కూటీడిక్కీలో పెట్టుకున్నారు. మార్కండేయ కాలనీలోని బేకరీవద్దకువెళ్లి కొనుగోలు చేస్తుండగా బైక్‌పైవచ్చిన ఇద్దరు స్కూటీడిక్కీ తాళం తీసి రూ.50వేలు ఎత్తుకెళ్లారు. ఈఘటన సీసీ కెమెరాల్లో రికార్డయింది. గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులు ఘటన స్థలానికిచేరుకుని విచారణ జరుపుతున్నారు. ఎస్‌బీఐ ఏటీఎంవద్దనుంచే దొంగలు అంజలిని ఫాలో అయినట్లు తెలుస్తుంది. అదనుకోసం చూసి సొమ్ముఎత్తుకెళ్లారు. సీసీపుటేజీ ఆధారంగా నిందితులను గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు.

ద్విచక్ర వాహనాల దొంగ పట్టివేత

వేములవాడ టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణ పరిధిలోని తిప్పాపూర్ గ్రామంలో ద్విచక్రవాహనాలను దొంగిలించే యత్నంలో దొంగ గ్రామ యువకులకు దొరికాడు. శనివారం రాత్రి తిప్పాపూర్‌లో రెండు ద్విచక్రవాహనాలను దొంగిలించేందుకు ప్రయత్నిస్తున్న వ్యక్తిని గ్రామ యువకులు వెంటపడి పట్టుకొని పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టిన ఆర్టీసీ బస్సు

- యువతికి తీవ్ర గాయాలు



బస్సు కింద ద్విచక్రవాహనం

మల్యాల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మల్యాల శివారులోని సాయిబాబా గుడి సమీపంలో శనివారం ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో పెంచాల శృతి అనే యువతి తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం మల్యాల మండలం తాటిపల్లికి చెందిన పెంచాల శృతి ద్విచక్రవాహనంపై మల్యాలలో టిఫిన్స్ తీసుకొని తిరిగి తాటిపల్లికి వెళ్తుండగా జగిత్యాల డిపోకు చెందిన ఆర్టీసీబస్సు ఢీకొంది. దీంతో శృతి తలకు తీవ్రగాయాలు కాగా మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌కు తీసుకెళ్లారు. బాధితురాలి తండ్రి పంబాల సురేశ్ ఫిర్యాదు ఫిర్యాదు మేరకు ఆర్టీసీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

డీసీఎం వ్యాన్‌ను ఢీ కొట్టిన ఆర్టీసీ బస్సు

శంకరపట్నం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం మొలంగూర్ గ్రామశివారులో డీసీఎం వ్యాన్‌ను ఆర్టీసీబస్సు వెనుక నుంచి ఢీకొట్టిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హుజూరాబాద్ నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్న డీసీఎం వ్యాన్ మొలంగూర్ శివారులో స్పీడ్‌బ్రేకర్ వద్ద డ్రైవర్ సడన్ బ్రేక్‌వేశాడు. దీంతో వ్యాన్‌వెనక వస్తున్న కరీంనగర్-1 డిపోకు చెందిన ఆర్టీసీబస్సు వ్యాన్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో బస్సుపాక్షింగా ధ్వంసమైంది. ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. పోలీసులు వివరాలు నమోదు చేసుకున్నారు.

రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీ

- ఒకరికి తీవ్ర గాయాలు

శంకరపట్నం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని అయ్యప్ప కాలనీవద్ద జాతీయరహదారిపై రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గూడెపు జశ్వంత్‌రెడ్డి తనస్నేహితుడు సాయిచరణ్‌తో కలిసి ద్విచక్రవాహనంపై కరీంనగర్‌నుంచి సింగాపూర్ వెళ్తున్నాడు. ఈక్రమంలో కేశవపట్నంలోని అయ్యప్పకాలనీ వద్ద ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో జశ్వంత్‌రెడ్డి కాలువిరగగా, తలకు బలమైన గాయమైంది. స్థానికులు అతన్ని 108లో హుజూరాబాద్ ఆస్పత్రికి తరలించారు.

రోడ్డుపై పడిన రేషన్ బియ్యం బస్తాలు



రోడ్డుపైన రేషన్ బియ్యం బస్తాలు

మార్కండేయకాలనీ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ రహదారిపై బుగ్గ రైల్వేబ్రిడ్జి సమీపంలో శని వారం రేషన్‌బియ్యం బస్తా లు తరలిస్తున్న లారీ నుంచి పది బస్తాల వరకు కింద పడ్డాయి. పెద్దపల్లి ఎంఎల్‌సీ గోడౌన్‌నుంచి ఎన్‌టీపీసీ ప్రాంత రేషన్ షాపులకు వస్తున్న లారీలో బస్తాలను సరిగా లోడ్ చేయకపోవడంతో కొన్ని బస్తాలు కిందపడ్డాయి. దీంతో బియ్యం రోడ్డుపై పడ్డాయి. లారీడ్రైవర్ కొద్దిదూరం వరకు గమనించలేదు. వెనుక వస్తున్న ప్రయాణికులు లారీడ్రైవర్‌కు సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన తిరిగి వచ్చి బస్తాలను తిరిగి లారీలో లోడ్ చేసుకున్నాడు.



స్వామి వారిని దర్శనం చేసుకుంటున్న భక్తులు



రాజన్న సన్నిధిలో దీపాలు వెలిగిస్తున్న సుహాసినులు



కొండగట్టు అంజన్న ఆలయ ఆవరణలో భక్తులు

ధర్మపురి క్షేత్రంలో భక్తుల రద్దీ

ధర్మపురి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం పురస్కరించుకొని ధర్మపురిక్షేత్రంలోని లక్ష్మీ నృసింహస్వామి, అనుబంధఆలయాల్లో శనివారం భక్తుల రద్దీ పెరిగింది. మహిళలు నదిలో కార్తీక దీపాలు వదిలారు. అభిషేకాది పూజలు, స్వామి వారల నిత్యకల్యాణం జరిపించారు. శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద నాగదేవతకు, రావి చెట్టు ఆంజనేయస్వామి వారికి అర్చకులు క్షీరాభిషేకం నిర్వహించారు. స్వామివారలకు ఆలయ వేద పారాయణదారు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ మంత్రోచ్చరణల మధ్య ముఖ్యఅర్చకులు సీహెచ్ రమణాచార్యా, నరసింహమూర్తి, అర్చకులు నిత్యపూజలు, అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

రాజన్న సన్నిధిలో..

వేములవాడ టౌన్: వేములవాడలోని రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో సామూహిక కార్తీక దీపోత్సవం నిర్వహించారు. శనివారం సాయంత్రం భీమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఏఈవో శ్రవణ్ కుమార్ జ్యోతిప్రజ్వలన చేసి సాంస్కృతిక కార్యక్రమాలను ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా సుహాసినీల ఆధ్వర్యంలో దీపాలు వెలిగించగా, ఆలయ అర్చకుల చేతుల మీదుగా వారికి వాయనం పసుపుకుంకుమ, అక్షింతలు, గాజులు, స్వామివారి ఫొటోను అందజేశారు. కార్యక్రమంలో ఏఈవో అశోక్, సీనియర్ అసిస్టెంట్ గౌతమ్, జూనియర్ అసిస్టెంట్ కూరగాయల శ్రీనివాస్, సింహచారి, ఆలయ అర్చకులు, వేదపండితులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

కొండగట్టులో..

మల్యాల : కొండగట్టు ఆంజనేయస్వామిని శనివారం వేలాదిగాభక్తులు దర్శించుకున్నారు. కార్తీక మాసం కావడంతో కావడంతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం ముందుగల రావిచెట్టు వద్ద దీపాలు వెలిగించారు. రాత్రివేళల్లో దేవస్థానం తరుపున దీపోత్సవం నిర్వహించారు. కాగా శనివారం జగిత్యాల మొదటి అదనపు సెషన్స్ న్యాయమూర్తి నారాయణ అంజన్నను దర్శించుకున్నారు.

నేడు సాట్ 'క్యూ' ఎస్సార్ అకడమిక్ టాలెంట్ క్వెస్ట్



సాట్ క్యూ టాలెంట్ క్వెస్ట్ కరపత్రాన్ని విడుదల చేస్తున్న ఎస్సార్ విద్యాసంస్థల చైర్మన్ ఎ.వరదారెడ్డి

హసన్‌పర్తి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రోత్సాహం, ఉన్నత విద్య అవకాశాలను విస్తరించడమే లక్ష్యంగా ఎస్సార్ ఎడ్యుకేషనల్ అకాడమీ ప్రతి సంవత్సరం నిర్వహించే ప్రత్యేక ప్రతిభా పరీక్ష సాట్ క్యూ ఎస్సార్ అకడమిక్ టాలెంట్ క్వెస్ట్ ఆదివారం నిర్వహిస్తున్నట్లు ఎస్సార్ విద్యాసంస్థల చైర్మన్ ఎనగందుల వరదారెడ్డి తెలిపారు. హనుమకొండ టీచర్స్ కాలనీలోని ఎస్సార్ ఎడ్యు సెంటర్‌లో శనివారం సాట్ క్యూ టాలెంట్ క్వెస్ట్ కరపత్రాన్ని ఆయన విడుదల చేసి మాట్లాడారు. ఇంటర్మీడియట్‌లో చేరబోయే పదో తరగతి విద్యార్థుల కోసం ప్రత్యేకంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హనుమకొండ టీచర్స్ కాలనీ ఎస్సార్ ఎడ్యు సెంటర్ కేంద్రంలో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు నిర్వహించే ప్రవేశ పరీక్షను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 10వ తరగతి స్థాయిలో మ్యాథ్స్ ఫిజిక్స్ కెమిస్ట్రీ సిలబస్‌లో మొత్తం 75 ప్రశ్నలు (ప్రతి సబ్జెక్టుకు 25 చొప్పున) ఉంటాయని తెలిపారు. ఈ ప్రవేశ పరీక్షలో ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రోత్సాహక స్కాలర్‌షిప్‌లు, 100 శాతం స్కాలర్‌షిప్‌లు పొందే అవకాశంతో పాటు ఐఐటీ, జేఈఈ, నీట్ కోచింగ్ ప్రవేశం పొందే ఎంపీసీ స్ట్రీమ్, జేఈఈ మెయిన్, అడ్వాన్స్‌డ్ (ఫోకస్ ప్రైమ్/ఫోకస్ ప్లస్/ఫోకస్/స్పార్క్/టైటన్) బైపీసీ స్ట్రీమ్ నీట్, ఎంసెట్ (ఫోకస్ ప్రైమ్/టైటన్) కోర్సులకు అర్హులని తెలిపారు. విద్యార్థులు పరీక్ష నమోదు కోసం సమీపంలోని ఎస్సార్ బ్రాంచ్‌ను లేదా 9642117378, 9154989356, 8886287456, 9154854700, 9642117330, 9642117830, 9642114698 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

పతకాలు సాధించిన సైనిక్ స్కూల్ విద్యార్థులు

చొప్పదండి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో జరిగిన తెలంగాణ రాష్ట్ర ఎస్‌జీఎఫ్ అండర్-19 అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీల్లో మండలంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల సైనిక్ స్కూల్ విద్యార్థులు పతకాలను గెల్చుకున్నారు. 400మీటర్ల రన్నింగ్‌లో హోమ్‌రాజు గోల్డ్ మెడల్, అచల్ సిల్వర్‌మెడల్, లాంగ్‌జంప్‌లో గణేష్ గోల్డ్‌మెడల్, రన్నింగ్‌లో జె రోషన్ సిల్వర్‌మెడల్ గెల్చుకుని రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. పతకాలు సాధించిన విద్యార్థులను, పీఈటీ సుమన్‌ను డైరెక్టర్ కల్నల్ రాజాదత్త, ప్రిన్సిపాల్ వి లింగయ్య, ఎస్‌వీపీ శ్రీనివాస్, జేవీపీ ప్రమోద్ రాజు అభినందించారు.

కడెం ప్రాజెక్టులో దూకి ఉపాధ్యాయుడి బలవన్మరణం



రాజశేఖర్(ఫైల్)

కడెం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): నిర్మల్ జిల్లాలోని కడెం ప్రాజెక్టులో దూకి ఓ ఉపాధ్యాయుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పెద్దపల్లిజిల్లా జూలపల్లికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు కుంట్ల రాజశేఖర్ రెడ్డి శనివారం వివాహ విందుకు వచ్చి ప్రాజెక్టులో దూకాడు. గమనించిన ఇరిగేషన్ అధికారులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న కడెం ఎస్సై సాయికిరణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

ఎన్‌టీపీసీ కాంట్రాక్టు కార్మికుడి ఆత్మహత్య

కోల్‌సిటీ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ప్రశాంత్‌నగర్‌లో నివాసముండే ఎన్‌టీపీసీ కాంట్రాక్టు కార్మికుడు దాసరి రాజ్‌కుమార్ (36) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. రాజ్‌కుమార్ భార్య స్రవంతి ప్రైవేట్ స్కూల్‌లో టీచర్‌గా పని చేస్తుంది. శుక్రవారం సాయంత్రం ఆమె ఇంటికి వచ్చేసరికి రాజ్‌కుమార్ అపస్మారక స్థితిలో ఉండడం, పక్కనే పురుగుల మందు డబ్బా ఉండడంతో ఆమె రాజ్‌కుమార్ తండ్రి చంద్రయ్యకు ఫోన్‌చేసి తెలిపింది. రాజ్‌కుమార్‌ను ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే అతను మృతి చెందినట్టు వైద్యులు పేర్కొన్నారని వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. కుమారుడి మృతిపై అనుమానాలు ఉన్నాయని చంద్రయ్య శనివారం గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్టు పోలీసులు పేర్కొన్నారు.

నేడు ఐఎంఏ రాష్ట్ర సదస్సు

● ముఖ్య అతిథిగా హాజరుకానున్న మంత్రి శ్రీధర్‌బాబు



ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న డాక్టర్లు

సుభాష్‌నగర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) రాష్ట్ర సదస్సును ఆదివారం నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజింగ్ చైర్మెన్ డాక్టర్ పి కిషన్ తెలిపారు. శనివారం నగరంలోని ఐఎంఏ హాలులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాకేంద్రంలోని వీ కన్వేన్షన్‌లో సదస్సును నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సదస్సులో రాష్ట్రవ్యాప్తంగా డాక్టర్లు ఎదుర్కొంటున్న సమస్యలు, పేషంట్లకు అందించే అధునాతన వైద్యంపై సీనియర్ వైద్యులు మాట్లాడుతారని తెలిపారు. ఉన్నత ప్రమాణాలతో పేషంట్లకు ఎలాంటి వైద్యం అందించాలనే అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు. అలాగే రాష్ట్ర ఐఎంఏ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం కార్యక్రమం ఉంటుందని, ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఐటీ శాఖమంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, సుడాచైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి పాల్గొంటారని తెలిపారు. ఇలాంటి సదస్సులు నేటితరం వైద్యులతో పాటు, ఇతర సీనియర్‌వైద్యులకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. సమావేశంలో రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ శ్యామ్‌సుందర్, డాక్టర్ విజేందర్‌రెడ్డి, కరీంనగర్ ఐఎంఏ అధ్యక్షురాలు డాక్టర్ శైలజ, కార్యదర్శి డాక్టర్ మహేశ్‌బాబు, కోశాధికారి డాక్టర్ నీలిమ, మాజీ అధ్యక్షుడు డాక్టర్ పొలాస రాంకిరణ్, డాక్టర్ వసంత్‌రావు, మాజీ కోశాధికారి డాక్టర్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న గోదావరి హారతి

ధర్మపురి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం పురస్కరించుకుని ధర్మపురి వద్ద గోదావరి హారతి పదకొండవ రోజు శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ వేదపండితులు, అర్చకులు, సిబ్బంది, భక్తులు, మహిళలు మంగళ వాయిద్యాలు వెంట రాగా గోదావరి నది వరకు శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం ఆలయ వేదపారాయణదారు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు నది వద్ద విశేష పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, ఆలయ ఉపప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, వేదపండితులు ముఖ్యఅర్చకులు సీహెచ్ రమణాచార్యా, నంబి నరసింహమూర్తి, ఆలయ అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంతోష్‌కుమార్, సంపత్‌కుమార్, అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



ధర్మపురి వద్ద గోదావరి హారతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

విద్యార్థులకు పొదుపు పాఠాలు

- రచ్చపల్లి పాఠశాలలో కిడ్డీ బ్యాంక్ ఏర్పాటు
- జంక్ ఫుడ్ నిషేధంతో పొదుపు చేస్తున్న విద్యార్థులు
- లంచ్ టైంలో బ్యాంక్ నిర్వహణ



ధర్మారం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆ పాఠశాలలో విద్యార్థులు పొదుపు పాఠాలు నేర్చుకుంటున్నారు. చిరుతిండి కోసం తెచ్చుకున్న నగదును కిడ్డీ బ్యాంక్ పేరుతో జమ చేసుకుంటూ.... లెక్కాపత్రాలు చూసుకుంటూ... ఆర్థిక పాఠాల వైపు అడుగులు వేస్తున్నారు.

ఆటాపాటలతో విద్యనందిస్తూ ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా రచ్చపల్లి ప్రాథమిక పాఠశాల గుర్తింపు తెచ్చుకొంది. పాఠశాలకు వచ్చే విద్యార్థులు రోజూ లంచ్ టైంలో బయట ఏదో ఒక చిరుతిండి కొనుగోలు చేస్తారు. అందుకు ఐదు నుంచి పది రూపాయలు ఖర్చు చేస్తారు. పాఠశాలలో జంక్ ఫుడ్ నిషేదంతో రోజు తెచ్చుకునే చిల్లర డబ్బులు ఖర్చు కాకుండా విద్యార్థులు కిడ్డీ బ్యాంక్ ఏర్పాటు చేసి అందులో జమ చేసుకుంటున్నారు. ఇందుకోసం కిడ్డీ బ్యాంక్ పేరిట విద్యార్థులు ఓ కమిటీని ఏర్పాటు చేశారు. అందులో ఒకరు మేనేజర్ గా వ్యవహరిస్తూ ఉండగా మరొకరు క్లర్క్‌గా ఉన్నారు. ఈ కిడ్డీ బ్యాంక్ కేవలం లంచ్ అవర్లో మాత్రమే నిర్వహిస్తారు. విద్యార్థులు తెచ్చుకున్న డబ్బులను మేనేజర్, క్లర్క్ పర్యవేక్షణలో కిడ్డీ బ్యాంక్‌లో వేసి లెడ్జర్ బుక్‌లో నమోదు చేస్తారు. జమ అయిన మొత్తం రూపాయల నుంచి వారికి అవసరం ఉన్నంతా విత్‌డ్రా చేసి చదువుకు అవసరమైన పెన్, పెన్సిల్, నోట్ బుక్స్ కొనుగోలు చేసుకుంటారు. దీంతో విద్యార్థులు చిన్న నాటి నుంచే బ్యాంక్ పని తీరు ఎలా ఉంటుందో నేర్చుకోవడమే కాకుండా, ప్రతీ రూపాయి విలువ తెలుసుకుని విద్యార్థులు భవిష్యత్ ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి ఉపయోగ పడుతుందని పలువురు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



కిడ్డీ బ్యాంక్‌లో డబ్బులు జమ చేసుకుంటున్న విద్యార్థులు

ఆర్థిక క్రమశిక్షణ నేర్పేందుకే కిడ్డీ బ్యాంక్

- సముద్రాల వంశీ మోహనాచార్యులు (పాఠశాల ప్రధానోపాధ్యాయులు)



చాలా మంది విద్యార్థులు చిన్న నాటి నుంచే జంక్ ఫుడ్‌కు అలవాటు పడుతున్నారు. అందుకే పాఠశాలలో జంక్ ఫుడ్ నిషేధం పెట్టాం. దీంతో చిరు తిండ్లు తినకుండా ఆరోగ్యం కాపాడుకుంటారు. దాంతో పాటు ఆర్థిక క్రమశిక్షణ నేర్చుకుంటారు.

పొదుపు ఎలా చేయాలో నేర్చుకున్న

- అర్జున్ తిలక్ (5వ, తరగతి విద్యార్థి)



రోజు ఇంటి నుంచి తెచ్చుకున్న డబ్బులతో ఏదో ఒకటి కొనుక్కొని తినేవాన్ని. పాఠశాలలో ఉపాధ్యాయులు జంక్ ఫుడ్‌ను నిషేధించారు. దీంతో మేమే కిడ్డీ బ్యాంక్ ఏర్పాటు చేసుకొని రోజు 5, 10 రూపాయలు అందులో జమ చేసుకుంటున్నాం. ఇప్పుడు నా ఖాతాలో 150 రూపాయలు ఉన్నాయి.

విద్యార్థుల ఆర్థిక భవిష్యత్‌కు పునాది

- హరిణి (పేరెంట్)



డబ్బుల విలువ తెలిసేలా కిడ్డీ బ్యాంక్ ఏర్పాటు చేయడం సంతోషంగా ఉంది. పిల్లలకు ఇది ఒక మంచి అలవాటుగా మారడమే కాకుండా వారి ఆర్థిక భవిష్యత్‌కు పునాది వేస్తుంది. కిడ్డీ బ్యాంక్ ఆలోచన చేసిన పాఠశాల ప్రధానోపాధ్యాయులకు కృతజ్ఞతలు.

శ్రీరాంసాగర్‌కు కొనసాగిన వరద



శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో నిల్వ ఉన్న నీరు

జగిత్యాల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు వరదనీరు రావడం శనివారం కొనసాగింది. ఎగువ ప్రాంతం నుంచి 56,513క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. 16వరద గేట్లు ఎత్తి దిగువ గోదా వరిలోకి 47,059క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ప్రాజెక్టు నీటినిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలకు గాను ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

ఎల్‌ఎండీ నుంచి కొనసాగుతున్న నీటి విడుదల

తిమ్మాపూర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎల్‌ఎండీకి మోయతుమ్మెద వాగు నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో ఆధారంగా ప్రస్తుతం 4 గేట్ల నుంచి దిగువకు 8వేల క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. ఎల్‌ఎండి పూర్తి నీటి సామర్థ్యం 24.034 టీఎంసీలు కాగా ప్రస్తుతం 23.645 టీఎంసీల నీరునిల్వ ఉంది. మోయతుమ్మెద వాగు నుంచి 7934క్యూసెక్కులు, ఎగువ కాకతీయకాలువ నుంచి 320క్యూసెక్కుల నీరు మొత్తం 8254 క్యూసెక్కుల నీరు ఎల్‌ఎండీలోకి ఇన్‌ఫ్లో వస్తోంది. ఎల్‌ఎండీ 4గేట్ల నుంచి 8వేల క్యూసెక్కులు, మిషన్ భగీరథ, ఆవిరి రూపంలో 254క్యూసెక్కులు మొత్తం 8254క్యూసెక్కుల అవుట్‌ఫ్లో వెలుతోందని అధికారులు తెలిపారు.

రైతులకు తక్షణమే పరిహారం అందించాలి

● సీపీఐ జాతీయ నాయకుడు చాడ వెంకటరెడ్డి

చిగురుమామిడి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): వర్షాలకు దెబ్బతిన్న పంటలకు తక్షణమే పరిహారం అందించి రైతులను ఆదుకోవాలని సీపీఐ జాతీయ నాయకుడు, మాజీఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని రేకొండ తదితర గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను, బ్రిడ్జిలను, రోడ్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించిన 10వేల ఆర్థిక సాయం వెంటనే అందించాలన్నారు. మండలాల్లో యుద్ధ ప్రాతిపదికన సర్వేలు చేయాలన్నారు. అనేక గ్రామాల్లో రోడ్లు, బ్రిడ్జిలు, వ్యవసాయ బావులు దెబ్బతిన్నాయన్నారు. పశువులు మృతచెందిన సంఘటన కలిచి వేసిందన్నారు. కార్యక్రమంలో సింగిల్‌విండో డైరెక్టరు చాడ శ్రీధర్‌రెడ్డి, సీపీఐ జిల్లాకౌన్సిల్ సభ్యుడు బోయినిపటేల్, ముద్రకోల రాజయ్య, పరకాల కొండయ్య, విలాసాగరం అంజయ్య, రాచర్ల రంగయ్య, బోయిని రాజు, ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి చెంచాల రవి, కార్యదర్శులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



దెబ్బతిన్న వరిని పరిశీలిస్తున్న చాడ వెంకటరెడ్డి

కాశీలో వేములవాడ రాజన్న కల్యాణం

వేములవాడటౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారి కల్యాణ మహోత్సవం కాశీ పుణ్యక్షేత్రంలోని విశ్వనాథ ఆలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన శ్రీపరాశర వైదిక ఆగమ వేద శాస్త్ర పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భాగంగా వేములవాడ రాజరాజేశ్వర ఆలయ అర్చకులు నమిలికొండ ఉమేష్‌శర్మ, చంద్రగిరి శరత్‌శర్మ, నెమలికొండ రాజేశ్వరశర్మ, మామిడిపల్లి శరత్, వెంకటయ్య ఆధ్వర్యంలో కల్యాణం నిర్వహించారు. ఈ కల్యాణోత్సవంలో ఆలయ ఈవో రమాదేవి, ఏఈఓటి శ్రీనివాస్, సూపరింటెంట్ శ్రీనివాస శర్మ, వి.భాస్కర్ పాల్గొన్నారు.



రాజన్న కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

కొనుగోలు కేంద్రాలకు దొంగల బెడద

● రాత్రివేళలో చోరీకి గురవుతున్న ధాన్యం
● చోద్యం చూస్తున్న నిర్వాహకులు

మానకొండూర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాలకు వరిధాన్యాన్ని తరలిస్తే కాపలాదారులు లేకపోవడంతో రాత్రి వేళలో ధాన్యం చోరీకి గురవుతోంది. దీంతో రైతులు ఎవరికి చెప్పాలో తెలియక లబోదిబోమంటున్నారు. మండలంలో ఐకేపీ ఆధ్వర్యంలో లింగాపూర్, రంగపేట, పచ్చునూర్, వెల్ది, తదితర గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు మహిళల ఆధ్వర్యంలో కొనసాగుతున్నాయి. ఈ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని కాపాడేందుకు రాత్రివేళలో నిర్వాహకులు కాపలాదారులను నియమించాల్సి ఉంటుంది. అవేమీ పట్టించుకోకుండా నిర్వాహకులు వదిలి వెల్లిపోతున్నారు. ఇదే అదనుగా భావించి రోడ్డుకు దగ్గరగా ఉండే కొనుగోలు కేంద్రాలను టార్గెట్ చేసిన దొంగలు రాత్రివేళలలో వాహనాల్లో ధాన్యాన్ని తరలించే ప్రయత్నం చేస్తున్నారు. మండలంలో ఐకేపీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న రంగపేట కొనుగోలు కేంద్రంలో శుక్రవారం తెల్లవారుజామున ఓ వాహనంలో 20సంచుల్లో ధాన్యం నింపుతుండగా దారివెంబడి వెళ్లే వారు గమనించి రైతులకు సమాచారం అందించారు. రైతులు సంఘటనా స్థలానికి చేరుకొని పట్టుకునే క్రమంలో ఒకరు పారిపోగా మరొకరిని పట్టుకొని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పజెప్పారు. పోలీసులు కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. ఇప్పటికైనా కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు మేల్కొని కాపలాదారులను ఏర్పాటు చేసిధాన్యాన్ని కాపాడాలని రైతులు కోరుతున్నారు.



రంగపేట కొనుగోలు కేంద్రంలో ధాన్యం

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో విజేతలుగా నిలవాలి

● సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి సీనియర్స్ కరీంనగర్ ఉమ్మడిజిల్లా జట్లు విశేష ప్రతిభచాటి విజేతలుగా నిలవాలని జిల్లా ఖోఖో అసోసియేషన్ అధ్యక్షుడు, సుడాచైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎస్సారార్ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో నిర్వహిస్తున్న సీనియర్స్ మహిళలు, పురుషుల ఖో-ఖో జట్ల శిక్షణశిబిరాన్ని సుడాచైర్మన్ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకొని మాట్లాడారు. కోచ్‌ల శిక్షణలో క్రీడాకారులు ఖో-ఖోలోని నైపుణ్యాలలో ప్రతిరోజు సాధన చేస్తున్నారన్నారు. ఈనెల7,8,9తేదీల్లో పెద్దపల్లి జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో కరీంనగర్, సిరిసిల్ల, జగిత్యాల జిల్లాలకు చెందిన క్రీడాకారులతో కూడిన ఉమ్మడిజిల్లా జట్లు పాల్గొంటాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ఖో-ఖో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వై మహేందర్‌రావు, జిల్లా సంఘ ఉపాధ్యక్షుడు, ట్రాఫిక్ ఆర్‌ఐ కుమారస్వామి, రాష్ట్ర డిగ్రీ కళాశాలల లెక్చరర్ల సంఘ అధ్యక్షుడు డాక్టర్ సురేందర్ రెడ్డి, ఎస్సారార్ కళాశాల ఉపన్యాసకులు, జిల్లా సంఘ ప్రతినిధులు సూర్య ప్రకాశ్, డాక్టర్ ఎ రవీందర్, కట్ట సంతోష్, కరుణాకర్, అశోక్, రాములు, ఖో-ఖో కోచ్‌లు వెంకటేశ్, ఆనంద్, జలందర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపిక



అక్షయకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాస్

ఓదెల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని మోడల్ కళాశాలలో ఇంటర్ చదువుతున్న కనగర్తి విద్యార్థి వేల్పుల అక్షయ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో రాష్ట్రస్థాయికి ఎంపికైంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయిలో వెయిట్‌లిఫ్టింగ్ క్రీడాపోటీలు నిర్వహించగా జిల్లా స్థాయిలో బంగారుపతకం సాధించింది. మోడల్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న అక్షయ ఎంపికపై కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, పీడీ కుమారస్వామి, అధ్యాపకులు, ఉపాధ్యాయులు అభినందించారు. వరంగల్ జిల్లాకేంద్రంలో రాష్ట్రస్థాయి వెయిట్‌లిఫ్టింగ్ పోటీలు జరగనున్నాయి.

ప్రశాంతంగా అర్బన్ బ్యాంకు ఎన్నికలు

● 44.23 శాతం పోలింగ్
● పోలైన ఓట్లు కరీంనగర్‌లో 3,342 ఓట్లు... జగిత్యాలలో 772



పోలింగ్ కేంద్రం లోపల హెల్ప్ డెస్క్ వద్ద ఓటర్ల సందడి

కరీంనగర్ టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ సహకార అర్బన్‌బ్యాంకు పాలకవర్గ ఎన్నికలు భారీ బందోబస్తు మధ్య ప్రశాంతంగా ముగిశాయి. కరీంనగర్, జగిత్యాలలో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా సాధారణ ఎన్నికల తరహాలో ఉదయం 7గంటల నుండే బ్యాంకుసభ్యులు (ఓటర్లు) తమ ఓటుహక్కును వినియోగించుకునేందుకు బారులు తీరారు. ఉదయం 7నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పోలింగ్ నిర్వహించగా 44.23 శాతం ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కరీంనగర్, జగిత్యాలలో కలిపి 9,287 మంది ఓటర్లు ఉండగా కరీంనగర్‌లో 7,272 మంది ఓటర్లకు 3,342 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. జగిత్యాలలో 2,025మంది ఓటర్లు ఉండగా 772 మంది ఓట్లు వేశారు. కరీంనగర్ ఓటర్ల కోసం ప్రభుత్వ మహిళా డిగ్రీకళాశాలలో 24పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసి ఒక్కో స్టేషన్‌లో 300మంది ఓటు హక్కును వినియోగించుకునే విధంగా ఏర్పాట్లు చేశారు. జగిత్యాలలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో 7 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటుచేశారు. ఉదయం 7గంటలకు పోలింగ్ ప్రారంభమైంది. ఒక్కోస్టేషన్‌లో ఒక పీవో, ఒక ఏపీవో, ముగ్గురు సిబ్బందితోపాటు మొత్తం 150 మందిని ఎన్నికల కోసం డ్యూటీలు వేశారు. 12 డైరెక్టర్లలో ఎస్సీ, ఎస్టీకి ఒకటి, మహిళలకు రెండు, జనరల్‌కు తొమ్మిది స్థానాలను రిజర్వు చేయడంతో ఎస్సీఎస్టీల కోసం బ్ల్యూ, మహిళలకు పింక్, జనరల్‌కు వైట్ కలర్ మూడు రంగుల్లో ఉన్న బ్యాలెట్‌లో ఒక్కో ఓటరు 12ఓట్లను వినియోగించుకోవాలని, అంతకంటే ఎక్కువ ఓట్లు వేస్తే చెల్లుబాటు కావని, తక్కువ ఓట్లు వేసుకోవచ్చని ఓటర్లకు సూచించారు. మధ్యాహ్నం 3 గంటల వరకు కరీంనగర్, జగిత్యాలలో ప్రశాంతంగా ముగిసింది. ఆ తర్వాత జగిత్యాల పోలింగ్ కేంద్రం నుంచి బ్యాలెట్ బాక్సులను కరీంనగర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలకు పోలీసు బందోబస్తు మధ్య ఎన్నికల సిబ్బందితో తరలించారు.



జగిత్యాలలో ఓట్లు వేయడానికి క్యూలో ఉన్న ఓటర్లు

● నాలుగు రౌండ్లలో ఓట్ల లెక్కింపు..

5 గంటల వరకు జగిత్యాల పోలింగ్ బాక్సులు కరీంనగర్‌కు చేరుకోగానే నాలుగు టేబుళ్లపై ఒక్కో బాక్సును ఓపెన్‌చేసి మూడు రంగుల్లోని బ్యాలెట్లను వేరు చేసి 50 చొప్పున బెండళ్లు కట్టి లెక్కింపు ప్రారంభించారు. సాయంత్రం 7.30గంటలకు మహిళాడైరెక్టర్ పోస్టులకు సంబంధించిన ఓట్లను, ఎస్సీ, ఎస్టీ రిజర్వ్‌డ్ ఓట్లను ఒక్కో టేబుల్ వేసి వేర్వేరుగా లెక్కింపు ప్రారంభించగా, జనరల్ ఓట్ల కోసం రెండు టేబుళ్లను వేసి లెక్కించారు.

● నేడో, రేపో చైర్మన్ ఎన్నిక

నాలుగు రౌండ్లలో లెక్కింపు చేపడుతున్నారు. అర్ధరాత్రి దాటిన తర్వాత ఫలితం తేలనున్నది. గెలుపొందిన 12 మంది డైరెక్టర్లలో ఒకరిని చైర్మన్‌గా, మరొకరిని వైస్ చైర్మన్‌గా ఎన్నుకుంటారు. ఆదివారం లేదా సోమవారం ఎన్నికైన డైరెక్టర్లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి చైర్మన్ ఎన్నిక నిర్వహించే అవకాశాలు ఉన్నాయి.

● జగిత్యాలలో 36 శాతం పోలింగ్..

జగిత్యాల అర్బన్: కరీంనగర్ కో-ఆపరేటివ్ అర్బన్‌బ్యాంక్ ఎన్నికలు జగిత్యాలలో శనివారం ప్రశాంతంగా ముగిశాయి. జగిత్యాలలో 36శాతం పోలింగ్ నమోదు అయినట్లు ఎన్నికల అధికారి రామకృష్ణ పేర్కొన్నారు. శనివారం ఉదయం పోలింగ్ మందకొడిగాసాగింది. మధ్యాహ్నం 2గంటల వరకు పోలింగ్ జరగగా రెండు గంటల తర్వాత పోలింగ్ కేంద్రం గేట్‌వేశారు. ఈ ఎన్నికల్లో జగిత్యాల పట్టణంతోపాటు చుట్టుపక్కల మండలాలు గ్రామాలకు చెందిన పలువురు తమ ఓటుహక్కు వినియో గించుకున్నారు. జగిత్యాల అర్బన్‌బ్యాంక్ ఎన్నికల్లో అనేకమంది ఓట్లు గల్లంతు అయ్యాయని బీజేపీ జగిత్యాల జిల్లా ఉపాధ్యక్షుడు అనుమల్ల కృష్ణహరి ఆరోపించారు. బ్యాంక్‌లోని వాటాదారులు మరణిస్తేతప్ప వారిఓట్లు తొలగించకూడదని నిబంధనలు ఉన్నాయన్నారు. అలాంటప్పుడు బతికిఉన్న వారి ఓట్లు ఎందుకు తొలగించారో అధికారులు సమాధానం చెప్పాలన్నారు. ఓటరు లిస్టును పరిశీలించి తిరిగి ఎన్నికలు నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు.



ఓటు వేసినట్లు సిరా గుర్తు చూపుతున్న ఓటర్లు

ఉత్తమ ఫలితాలే లక్ష్యం

(5వ పేజీ తరువాయి)

6754మంది విద్యార్థులు పది పరీక్షలకు హాజరుకాగా, 6629 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. 3119 మంది బాలురు పరీక్షలకు హాజరు కాగా 3041 మంది ఉత్తీర్ణులయ్యారు. 3635 మంది బాలికలు పరీక్షలకు హాజరు కాగా 3588 మంది ఉత్తీర్ణులయ్యారు. సంవత్సరాల వారీగా ఫలితాలు చూస్తే 2016-2017 విద్యాసంవత్సరంలో 87.3 ఉత్తీర్ణత సాధించారు. 2017-2018లో 91.3శాతం, 2018 - 2019లో 97.7శాతం, 2019 - 2020లో 100 శాతం, 2020-2021లో 100శాతం, 2021-2022లో 95.76 శాతం, 2022-2023లో 94.37శాతం, 2023-2024లో 98.27శాతం, 2024-2025లో 98.15 శాతం సాధించారు.

రివిజన్ ప్రక్రియను సమర్థవంతంగా చేపట్టాలి

- వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి



వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఇన్‌చార్జి కలెక్టర్, అధికారులు

సిరిసిల్ల కలెక్టరేట్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను సమర్థవంతంగా చేపట్టాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికలఅధికారి సుదర్శన్ రెడ్డి ఆదేశించారు. సిరిసిల్ల జిల్లా సమీకృత కలెక్టరేట్‌లో శనివారం జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో హైదరాబాద్ నుంచి రాష్ట్ర ముఖ్య అదనపు ఎన్నికల అధికారి లోకేష్‌కుమార్‌తో కలిసి సుదర్శన్‌రెడ్డి జిల్లా ఇన్‌చార్జీ కలెక్టర్, అధికారులతో ఈఆర్‌వోలతో, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పురోగతిలపై సమీక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ మొదటి కేటగిరి ఏ జాబితాను బీఎల్‌వో యాప్ ద్వారా నిర్ధారించుకోవడం జరుగుతుందని, ఇప్పటివరకు రాష్ట్ర వ్యాప్తంగా 63లక్షల ఓటర్లను నిర్ధారించామని, మిగిలిన 12 లక్షల ఓటర్ల నిర్ధారణ త్వరగా పూర్తి చేయాలన్నారు. కేటగిరి సీ, కేటగిరి డీ,లలోని ఓటర్‌లను కేటగిరి ఏకు మ్యాపింగ్ చేసే ప్రక్రియను మెరుగుపర్చాలన్నారు. జిల్లా ఎన్నికల అధికారి, ఇన్‌చార్జికలెక్టర్ గరిమా అగర్వాల్ మాట్లాడుతూ బీఎల్‌వోలు, సూపర్‌వైజర్ల ద్వారా ప్రక్రియను ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా త్వరగా పూర్తి చేస్తామన్నారు. వీడియో కాన్ఫరేన్స్‌లో జిల్లా అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, సిరిసిల్ల ఆర్డీవో వెంకటేశ్వర్లు, వేములవాడ ఆర్డీవో రాధాబాయి, సిరిసిల్ల తహసీల్దార్ మహేష్‌కుమార్, వేములవాడ తహసీల్దార్ విజయ్‌ప్రకాష్‌రావు, కలెక్టరేట్ పర్యవేక్షకులు ప్రవీణ్, ఎన్నికల అధికారి రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం అందజేత

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): వీర్నపల్లి మండలం అడవిపదిరలో ఇటీవల అనారోగ్యంతో పంబాల రాజేందర్ మృతిచెందాడు. ఆ కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న లాల్‌సింగ్‌తండాలోని ధనలక్ష్మీ గ్రామైఖ్య సంఘం సభ్యులు రాజేందర్ భార్య మాధవికి అండగా నిలిచారు. రూ.20వేల నగదును శనివారం అందజేశారు.

యువకుడికి గాయాలు

ఎల్లారెడ్డిపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం పదిర శివారులోని కామారెడ్డి- సిరిసిల్ల ప్రధాన రహదారిపై శనివారం రోడ్డు ప్రమాదం జరిగింది. వీర్నపల్లి మండలం భూక్యతండాలోని యువకుడు భూక్య శ్రీనివాస్ తీవ్రగాయాల పాలయ్యాడు. క్షతగాత్రుడిని 108వాహనంలో సిరిసిల్లలోని ఆసుపత్రికి తరలించారు. శ్రీనివాస్ తన ద్విచక్రవాహనంపై సిరిసిల్ల నుంచి ఎల్లారెడ్డిపేట వైపుకు వెళుతున్నాడు. ఇటు నుంచి సిరిసిల్లకు ప్రయాణిస్తున్న కారు ఢీకొట్టింది.

బీజేపీ ఆధ్వర్యంలో సీఎం దిష్టిబొమ్మ దహనం

సిరిసిల్ల రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వంపై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడం సరైందికాదని బీజేపీ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు దుమాల శ్రీకాంత్ అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో శనివారం సాయంత్రం బీజేపీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో భాగంగా కేంద్ర ప్రభుత్వంపై చేసిన అనుచిత వాఖ్యాలకు నిరసనగా సీఎం దిష్టిబొమ్మను దహనం చేశారు. ఇప్పటికైనా సీఎం వ్యాఖ్యలను వెనక్కి తిసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మ్యాన రాంప్రసాద్, ల్యాగల బాగయ్య, పట్టణ ఉపాధ్యక్షుడు అంకారపు రాజు, ప్రధానకార్యదర్శి కొండ నరేష్, దూడం నరేష్, చొప్పదండి శ్రీనివాస్, పల్లికొండ నర్సయ్య, ఇజ్జంపూరి మురళి, సూరం వినయ్, రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



సిరిసిల్లలో సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

● చందుర్తి నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో సీఎం రేవంత్‌రెడ్డి ఆపరేషన్ సింధూర్‌పై చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ బీజేపీ నాయకులు మండల కేంద్రంలో సీఎం దిష్టిబొమ్మను శనివారం సాయంత్రం దహనం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు మొకిలే విజేందర్ మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ మెంబర్ పొంచెట్టి రాకేష్ మండల ప్రధాన కార్యదర్శి పేరుక గంగరాజు యువ మోర్చా మండల అధ్యక్షుడు మోత్కుపల్లి రాజశేఖర్, కిసాన్ మోర్చా మండలం అధ్యక్షుడు చింతకుంట సాగర్, నాయకులు చినుముల హనుమయ్య చారి, మట్కా మల్లేశం, బండెల వెంకటేష్, బోరగాయ తిరుపతి పాల్గొన్నారు.

● కోనరావుపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు మిరియాల బాలాజీ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో భాగంగా అనుచిత వ్యాఖ్యలు చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశామని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మహిళా జిల్లా అధ్యక్షురాలు పల్లం అన్నపూర్ణ, జింక వెంకటి, మోత్కు మోహన్, దుర్గం తిరుపతి, జితేందర్ రెడ్డి, శ్రీకాంత్, విజయ్, సుమన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం..

తంగళ్లపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రెండు రోజుల క్రితం మానేరు వాగులో దూకిన తంగళ్లపల్లి మండల కేంద్రానికి చెందిన సల్లంగుల కృష్ణ(60) మృతదేహం శనివారం లభ్యమైంది. వివరాల్లోకి వెళితే.. తంగళ్లపల్లికి చెందిన కృష్ణ గురువారం సాయంత్రం వంతెనపై నుంచి మానేరు వాగులో దూకాడు. కాగా అప్పటి నుంచి ఆచూకీ కోసం పోలీసులు, కుటుంబ సభ్యులు తీవ్రంగా గాలించారు. మానేరు వాగులో ఆచూకీ కోసం ఎస్డీఆర్ఎఫ్ బృందం గాలింపు చర్యలు చేపట్టినప్పటికి ఫలితం లేకండా పోయింది. శనివారం కృష్ణ మృతదేహం మానేరు వాగు ఒడ్డును కనిపించింది. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం జిల్లా ప్రధాన ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య మణెమ్మ, ముగ్గురు కుమారులు సత్యనారాయణ, లక్ష్మీనారాయణ, యాదగిరిలు ఉన్నారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం



సత్యనారాయణ స్వామి వ్రతం చేస్తున్న దంపతులు

సిరిసిల్ల టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం ఏకాదశిని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని విద్యానగర్ శ్రీ భక్తాంజనేయ స్వామి దేవాలయం ఆవరణలో శనివారం దేవాలయం కమిటీ ఆధ్వర్యంలో సామూహికంగా శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాన్ని నిర్వహించింది. భక్తులైన దంపతులు భక్తి శ్రద్ధలతో స్వామివారికి వ్రతం చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో దేవాలయం కమిటీ అధ్యక్షుడు చేరాల ప్రసాద్, ప్రధాన కార్యదర్శి పుప్పాల ముకుందేష్, కోశాధికారి మామిడాల శ్రీధర్, ఉపాధ్యక్షులు పయ్యావుల శ్రీనివాస్, మాదిరెడ్డి అంజనాదేవి, భక్తులు పాల్గొన్నారు.

మొంథాతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

- తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీజేపీ నాయకుల ఆందోళన

ఇల్లంతకుంట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాలలో మొంథా తుఫాన్ వల్ల నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. బస్టాండ్ నుండి రైతులకు మద్దతుగా నినాదాలు చేస్తు శనివారం తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. సమస్యలపై తహసీల్దార్ ఫారూఖ్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షుడు భూమల్ల అనీల్‌కుమార్, నాయకులు మ్యాకల మల్లేశం, మామిడి హరీష్, ఇట్టిరెడ్డి లక్ష్మారెడ్డి, కాసం శ్రీనివాస్‌రెడ్డి, చింతలపెల్లి తిరుపతిరెడ్డి, పినకాసి అనీల్, దూది సుధీర్‌రెడ్డి, పయ్యావుల బాలయ్య, కూనబోయిన పర్శరాం తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

ఎకరాకు రూ.50 వేల నష్టపరిహారం చెల్లించాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేష్

సిరిసిల్ల రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో మొంథా తుఫాన్‌తో పాటు అకాల వర్షాలకు నష్టపోయిన రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేష్ కోరారు. నష్టపోయిన పంటలకు ఎకరానికి రూ 50వేల చొప్పున నష్ట పరిహారం అందించాలని, తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కోరారు. సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌లోని అమృత్‌లాల్ శుక్లా కార్మిక భవనంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు జిల్లాలో రైతులు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. కల్లాల వద్ద ఆరబోసిన ధాన్యం సైతం తడిసి నల్లగా మారిపోయిందన్నారు. పత్తి కూడా నల్లగా మారిపోయిందన్నారు. నాలుగు నెలలుగా కష్టపడి పండించిన పంటలు నీట మునిగిపోవడంతో రైతులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నష్టపోయిన రైతులందరికి ఎకరానికి రూ.50వేల చోప్పున నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా నల్లగా మారిన ధాన్యం, పత్తిలను ఏ వన్ గ్రేడ్ కింద మార్కెట్ రేట్‌కు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా అధికారులతో సర్వేలు చేయించి రైతులు ఎంత నష్టం జరిగిందని నిర్ధారించి వారికి ఆ లెక్కన నష్టపరిహారం చెల్లించాలన్నారు. వర్షాలు ఎపుడు వస్తున్నాయో అంతుపట్టకుండా ఉంటుందని, కాబట్టి కల్లాల వద్ద ఉన్న ధాన్యాన్ని వెంటవెంటనే కొనుగోలు చేసి రైస్‌మిల్లులకు తరలించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం స్పందించి వెంటనే రాష్ట్రంలో జరిగిన నష్టానికి నిధులను విడుదల చేసి రైతులను ఆదుకోవాలన్నారు. లేనిపక్షంలో సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామన్నారు.

ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శులు ఎగమంటి ఎల్లారెడ్డి, కోడం రమణ, జిల్లా కమిటి సభ్యులు గురజాల శ్రీధర్, సూరం పద్మ, శ్రీరాముల రమేష్‌చంద్ర, గుండేటి కనకయ్య, సందుపట్ల పోచమల్లు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

- నేతన్నచౌక్ వద్ద బీఆర్ఎస్ నాయకుల ధర్నా



సిరిసిల్లలో ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

సిరిసిల్ల టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ హాస్టల్స్‌లో జరుగుతున్న సంఘటనలపై ప్రభుత్వం విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకుడు కంచర్ల రవిగౌడ్ డిమాండ్ చేశారు. బీసీ హాస్టల్‌లో విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ పాపం ప్రభుత్వానిదేనని అన్నారు. శనివారం జిల్లా కేంద్రం నేతన్నచౌక్ వద్ద గద్వాల్ జిల్లా ఇటిక్యాల మండలం ధర్మవరంలోని బీసీ హాస్టల్‌లో విద్యార్థులకు జరిగిన ఫుడ్‌ప్యాయిజన్ పాపం ప్రభుత్వానిదేనని అంటూ బీఆర్ఎస్ నాయకులు ధర్నా చేపట్టారు. నేతన్నచౌక్ వద్ద బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలు తెలుపుతూ రోడ్డు బైఠాయించారు. ఈ సందర్భంగా రవిగౌడ్ మాట్లాడారు. విద్యార్థులపై ప్రభుత్వ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 25 నెలలు గడిచిన విద్యార్థుల సంక్షేమంపై శ్రద్ధ చూపడం లేదని అన్నారు. 25 నెలలో దాదాపు 110 మంది విద్యార్థులు ప్రాణాలో కోల్పోయిన ప్రభుత్వం నిర్లక్ష్యం వీడకపోవడం సిగ్గుచేటన్నారు. హాస్టల్‌లో చదువుకునే విద్యార్థులు దాదాపు పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన వారే ఉంటారని వారి తల్లిదండ్రులు ఎన్నో ఆశలతో ఉన్నత చదువలు చదివించాలని హాస్టల్స్‌కు పంపిస్తే వారి ప్రాణాల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం చూపడం దారుణం అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం రావడం విద్యార్థులకు శాపంగా మారిందని వరస సంఘటనలను విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. ప్రభుత్వ హాస్టల్స్‌లో జరుగుతున్న సంఘటనలపై ప్రభుత్వం వెంటనే విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అస్వస్థతకు గురైన విద్యార్థులకు ప్రభుత్వం వెంటనే అత్యుత్తమ వైద్య సేవలను అందించాలని జరుగుతున్న వరస సంఘటనలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఎస్‌కే అఫ్రోజ్, హరీష్, సాయి, ఆదిత్య, రామ్, చరణ్, జస్వంత్, అనీష్ అభినయ్, విక్రం, సిద్ధార్థ, శ్రీశేషం, లవన్, విద్యార్థులు పాల్గొన్నారు.

సీసీఐ పత్తి కొనుగోళ్లకు ఏర్పాట్లు

- దిగుబడి అంచనా మూడు లక్షల క్వింటాళ్లకు పైనే..

వేములవాడ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పత్తి పంటకు మద్దతు ధర లేకపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేములవాడ డివిజన్ పరిధిలోని రైతులు పండించిన పంటకు మద్దతు ధర అందించేందుకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆధ్వర్యంలో వేములవాడ సెంటర్ పరిధిలో మూడు సీసీఐ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించేందుకు మార్కెటింగ్ అధికారులు సిద్ధమవుతున్నారు. ఆగస్టు నుంచి సేకరించిన పత్తిని రైతులు ఇళ్లలో నిల్వచేసుకోగా, కొందరు తక్కువ ధరకు దళారులకు విక్రయించి నష్టపోతున్నారు. దీంతో మార్కెట్ అధికారులు వేములవాడ మండలంలోని సంకెపల్లి, నాంపల్లి, కొనరావుపేట మండలంలోని సుద్దాల గ్రామంలోని జిన్నింగ్ మిల్లులో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలను సోమవారం ప్రారంభించేందుకు సమాయత్తమవుతున్నారు.



సీసీఐ కొనుగోలుకు ఎంపిక చేసిన నాంపల్లి జిన్నింగ్ మిల్లు

ఆరు మండలాల్లో 3 లక్షల క్వింటాళ్లకు పైగా...

వేములవాడ డివిజన్ పరిధిలోని ఆరు మండలాల్లో 27 వేల 789 ఎకరాల్లో పత్తి సాగు చేయగా 3లక్షల 17వేల 425 క్వింటాళ్ల దిగుబడి రానున్నట్లు వ్యవసాయాధికారుల లెక్కలు చెబుతున్నాయి. వేములవాడలో 5015 ఎకరాల్లో 60180 క్వింటాళ్లు, వేములవాడ రూరల్‌లో 4100 ఎకరాల్లో 41000 క్వింటాళ్లు, బోయినపల్లి మండలంలో 6662 ఎకరాల్లో 79944 క్వింటాళ్లు, చందుర్తి మండలంలో 5548 ఎకరాల్లో 63033 క్వింటాళ్లు, రుద్రంగి మండలంలో 2065ఎకరాల్లో 24780 క్వింటాళ్లు, కొనరావుపేట మండలంలో 4399 ఎకరాల్లో 48488 క్వింటాళ్ల పత్తి దిగుబడి వస్తుందని వ్యవసాయాధికారులు అంచనా వేశారు.

స్లాట్ బుకింగ్ తప్పనిసరి..

వ్యవసాయ శాఖ ద్వారా రైతు పత్తి పంట నమోదు తప్పనిసరిగా చేసుకోని ఉండాలి. బయోమెట్రిక్, కనుపాప, ఓటీపీ పద్ధతల ద్వారా ఆధార్ ధ్రువీకరణతో కేపీపీఎస్ కిసాన్ యాప్ ద్వారా రైతులు స్లాట్ బుకింగ్ తప్పనిసరిగా చేసుకోవాల్సి ఉంటుంది. దీంతో రైతులకు క్యూఆర్ కోడ్ వస్తుంది. ఆధార్‌కార్డుకు ఫోన్ నంబర్ లింకు తప్పనిసరిగా ఉండాలనే నిబంధన ఉంది. నేరుగా సంబంధిత రైతులకు నగదు చెల్లింపుల కోసం ఆధార్ లింకు ఉన్న బ్యాంకు ఖాతా తప్పనిసరిగా జిరాక్స్ తప్పనిసరిగా జతపరచాలి. పత్తి రైతుల సౌకర్యం కోసం ప్రభుత్వం 1800 599 5779 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి సమాచారం తీసుకునే వెసులుబాటు కల్పించారు. 8897281111 గల వాట్సాప్ నంబర్ ద్వారా సీసీ సెంటర్‌లో కొనుగోలు కేంద్రాల వివరాలు, వేచి వుండే సమయం, పత్తి అమ్మకం, అర్హత, అమ్మకాల తక్పట్టి వివరాలు, చెల్లింపు స్థితి వంటి అంశాలను తెలుసుకునేందుకు వీలుగా అందుబాటులోకి తీసుకువచ్చినట్లు మార్కెట్ కమిటీ కార్యదర్శి సత్యనారాయణ వెల్లడించారు.

సీసీఐలో పత్తికి మద్దతు ధర..

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు క్వింటాళులకు మద్దతు ధరను పత్తి పింజ బీబీ మోడ్ రకానికి రూ.8110, పింజ బీబీఎస్‌పీఎల్ రకానికి రూ.8060, పింజ ఎమ్‌ఈసీహెచ్ రకానికి రూ.8010 ధరను నిర్ణయించారు. అంతే కాకుండా 8 నుంచి 12 శాతం తేమ శాతం ఉండాలని మైక్రోనీర్ విలువను బట్టి ధరలను నిర్ణయించనున్నట్లు తెలిపారు.

అతి త్వరలో ప్రారంభిస్తాం..

- సత్యనారాయణ, మార్కెట్ కమిటీ కార్యదర్శి, వేములవాడ

వేములవాడ మార్కెట్ యార్డు సెంటర్ పరిధిలో మూడు సీసీఐ కొనుగోలు కేంద్రాలను అతిత్వరలో ప్రారంభిస్తాం. సంకెపల్లి, నాంపల్లి, సుద్దాల జిన్నింగ్ మిల్లులో సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తాం. పత్తి రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు. పత్తికి ప్రభుత్వం అందించే మద్దతు ధరను సద్వినియోగం చేసుకోవాలి.

దళారులు రూ.6వేలకు కొనుగోలు చేస్తున్నారు..

- బొల్లు తిరుపతి, గొల్లపల్లి, వేములవాడ మండలం



నేను మూడెకరాల్లో పత్తి సాగు చేశాను. పత్తిని సేకరించి రెండు నెలలు కావస్తోంది. దళారులను ఆశ్రయిస్తే రూ.6వేలకు క్వింటాలు చొప్పున అడిగారు. సీసీఐ కొనుగోలు కేంద్రం కోసం చూస్తున్నాం. తేమ, పింజ పేరుతో సీసీఐ కొనుగోలుదారులు రైతులను ఇబ్బందులు పెట్టకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

గౌడ సంఘం ఆధ్వర్యంలో విద్యార్థికి సన్మానం

ఇల్లంతకుంట, నవంబరు 1(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో గౌడసంఘం ఆధ్వర్యంలో బొంగోని నిశిత అనే విద్యార్థిని శనివారం సన్మానించారు. నిశిత ఇటీవలే ఎంబీబీఎస్ సీటు సాధించింది. కార్యక్రమంలో స్పోర్ట్స్‌క్లబ్ అధ్యక్షుడు మామిడి రాజు, గౌడసంఘ అధ్యక్షుడు కొయ్యడ రాజయ్య, ఉపాధ్యక్షుడు అంతటి రమేష్, మాజీ ఎంపీటీసీ భాస్కర్, నాయకులు అంతటి శ్రీకాంత్, కొయ్యడ రామచంద్రం, దేవయ్య, బండారి నర్సయ్య, మల్లయ్య, నాగేంద్రం, రాజయ్య, నాగరాజు, సాయి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాసంపై అవగాహన

ఇల్లంతకుంట, నవంబరు 1(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం వ్యక్తిత్వ వికాసంపై విద్యార్థులకు అవగాహన సమావేశం జరిగింది. ఈసందర్భంగా న్యాయవాది, కళాశాల పూర్వవిద్యార్థి కడగండ్ల తిరుపతి మాట్లాడుతూ క్రమశిక్షణ, పట్టుదల ఉంటే విద్యార్థులు ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చన్నారు. సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని చ విజయం ఒక్కరోజులేనే వరించదన్నారు. ఉత్తమ విద్యార్థులకు సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దేవరాజం, అధ్యాపకుడు శ్రీనివాస్‌లతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించనున్న ఎమ్మెల్యే

ఇల్లంతకుంట, నవంబరు 1(ఆంధ్రజ్యోతి):మండలంలోని తాళ్ళపల్లి గ్రామంలోని పత్తిమిల్లులో సీసీఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ప్రారంభిస్తారని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పత్తిరైతులు దళారీల బారినపడి నష్టపోవద్దన్నారు. కార్యక్రమానికి అన్ని గ్రామాల నాయకులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

కస్తూర్బా గాంధీ విద్యార్థులకు వైద్యపరీక్షలు

ఇల్లంతకుంట, నవంబరు 1(ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రంలోని కస్తూరిభాగాంధీ పాఠశాలలో విద్యార్థినులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. బాలభవిత కార్యక్రమంలో భాగంగా శనివారం విద్యార్థుల్లో రక్తహీనత ఉన్న వారిని గుర్తించి మందులను పంపిణీ చేశారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, అప్పుడే వ్యాధులు రావన్నారు. జ్వరలక్షణాలు కనిపిస్తే వైద్యులకు సమాచారం అందివ్వాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు మౌనిక, రసజ్ఞ, ఎస్‌వో శిరీష, హెచ్‌ఈవో వెంకటరమణ, ఏఎన్ఎమ్ స్వప్నలతో పాటు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఒత్తిడిని అధిగమిస్తేనే విజయం..

ఎల్లారెడ్డిపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఒత్తిడిని అధిగమిస్తేనే విజయం వరిస్తోందని బ్రహ్మకుమారి సమాజం మానసిక నిపుణుడు సచిన్ పరాగ్ అన్నారు. మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని విద్యార్థులకు బ్రహ్మకుమారి సమాజం, జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో 'ఒత్తిడి నియంత్రణపై శనివారం అవగాహన కల్పించారు. సచిన్ పరాగ్ మాట్లాడుతూ విద్యార్థులు ఆందోళన చెందకుండా ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలన్నారు. విద్యార్థులు చిన్నతనం నుంచే మంచి అలవాట్లను అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి గంగాధర్, సభ్యులు ఉమారాణి, లలిత, శ్రీకాంత్, అధ్యాపకులు సత్యనారాయణ, పర్శరాములు, విష్ణుప్రసాద్, శ్రీనివాస్, చంద్రమౌళి, రవిచంద్ర, భూమక్క, కవిత, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రామనామ స్మరణతో మార్మోగిన సత్సంగ సదనం

ఎల్లారెడ్డిపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని సత్సంగ సదనం శనివారం భక్తుల రామనామ స్మరణతో మార్మోగింది. ఉదయం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. లిఖించిన పత్రాలను భక్తిశ్రద్ధల నడుమ శ్రీరామ కోటి స్థూపంలో వేశారు. హరే రామ హరే రామ భజనలతో హోరెత్తించారు. అనంతరం నగర సంకీర్తన చేశారు. కార్యక్రమంలో సత్సంగ సదనం అధ్యక్షుడు బ్రహ్మచారి లక్ష్మారెడ్డి, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

వెంకన్న సన్నిధిలో కార్తీక సందడి

వేములవాడ టౌన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణ శివారులోని శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో కార్తీక సందడి నెలకొంది. శనివారం వెంకటేశ్వరస్వామి దర్శనానికి భక్తులు బారులు తీరారు. శ్రీవారిని దర్శించుకొని కార్తీక దీపాలు వెలిగించారు.

బీసీల శాతం పెంచేందుకే సభ్యత్వ నమోదు

కోనరావుపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : బీసీల శాతం పెంచేందుకే సభ్యత్వ నమోదును నిర్వహిస్తున్నామని మండల అధ్యక్షుడు కచ్చకాయల బాలరాజు అన్నారు. కోనరావుపేట మండలం మంగళపల్లి గ్రామంలో మున్నూరు కాపు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. వెలిశాల రెడ్డి, శ్రీనివాస్, బీ. నర్సయ్య, నారాయణ, అంజయ్య, రాజిరెడ్డి, నర్సయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ దవాఖానల్లో ప్రసవాల సంఖ్య పెంచాలి



ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగర్వాల్

వేములవాడ రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ దవాఖానల్లో ప్రసవాల సంఖ్య పెంచేందుకు కృషి చేయాలని ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగర్వాల్ ఆదేశించారు. వేములవాడ రూరల్ మండలం హన్మాజిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ప్రభుత్వ పాఠశాలను శనివారం ఇన్‌చార్జి కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది హాజరు, ఓపీ, మందుల రిజిస్టర్, వ్యాక్సిన్ గది, మందులు ఇచ్చే గదిని పరిశీలించి, రోగులకు అందుతున్న వైద్య సేవలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే పాఠశాలలోని రికార్డులను పరిశీంచారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గర్భిణులు ప్రభుత్వ దవాఖానల్లో పేర్లు నమోదు చేసుకునేలా చూడాలన్నారు. ఆశా కార్యకర్తలతో సమావేశం నిర్వహించి, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలని సూచించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం రుచికరమైన భోజనం అందించాలన్నారు. పాఠశాల గ్రౌండ్‌ను శుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో రికార్డు స్థాయిలో డెలివరీలు

వేములవాడ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): వేములవాడ ప్రాంతీయ ప్రభుత్వ ఆసుపత్రిలో గత 14నెలల్లో 1200 డెలివరీలను విజయవంతంగా నిర్వహించినట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పెంచలయ్య తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక ఆసుపత్రిలో శనివారం వైద్య బృందంను అభినందించారు. అనంతరం డాక్టర్ పెంచలయ్య మాట్లాడుతూ దవాఖానలో గత నెల అక్టోబరులో 105 డెలివరీలు నిర్వహించామన్నారు. గతఏడాది ఆగస్టు నుంచి ఇప్పటివరకు 1200 కాన్పులు జరగగా, అందులో 349 సాధారణ కాన్పులు ఉన్నాయని వెల్లడించారు. ఆసుపత్రికి రూ.1.50 కోట్ల పరికరాలను అందించిన కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్‌కు, గైనిక్ డాక్టర్లను నియమించిన కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. గైనకాలజిస్ట్ డాక్టరులు, మత్తు వైద్యులను, కాన్పుల వార్డు సిబ్బందిని, పిల్లల వైద్యులను సన్మానించి అభినందించారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శ్రమదానం

గంభీరావుపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : గంభీరావుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం శ్రమదానం కార్యక్రమాన్ని చేపట్టారు. కళాశాల బోటానికల్ గార్డెన్‌లో ఉన్న పిచ్చి మొక్కలను, గడ్డిని చెత్తా చెదారాన్ని తొలగించి, ఆ ప్రాంతాన్ని శుభ్రం చేశారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ప్రభాకర్, ఎన్ఎస్ఎస్ ప్రోగాం ఆఫీసర్ పాక దర్మపురి, అధ్యాపకులు అంజనేయులు, వాణీ, శ్రావన్ కుమార్, ఆదివిష్ణు, మనోహర్, కృష్ణప్రసాద్, మహేష్, జగన్నాథం, దీపిక, రమ్య, రవీందర్ తదితరులు విద్యార్థులు ఉన్నారు.

సెస్ డైరెక్టర్‌ను పరామర్శించిన నాయకులు

గంభీరావుపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : గంభీరావుపేట సెస్ డైరెక్టర్ గౌరినేని నారాయణరావును శనివారం పలువురు నాయకులు పరామర్శించారు. ఇటీవల నారాయణరావు కాలుకు గాయం కాగా, శ్రీగాదలోని ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. నారాయణరావును పరామర్శించిన వారిలో మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దోసల చంద్రం, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి గంధ్యాడపు రాజు, నాయకులు దోసల శంకర్, రాజు తదితరులు ఉన్నారు.